TGTEL/26/A2635
వాస్తవాలు పలుకు DD9 వార్త
తెలుగు దినపత్రిక

## అనుమతులు మాయి... అజమాయిషీ మరొకరిదా..







హైదరాబాద్ | సంపుటి: 02 | సంచిక: 50 | 02-07-2026 గురువారం | పేజీలు: 08 | వెల: 3/-

# రేవంత్.. చర్చకు నేను రెడీ.. డేట్, టైమ్ ఫిక్స్ చేయండి

రేవంత్ భాష బాధ్యతాయుతంగా లేదన్న కేటీఆర్
తెలంగాణ అభివృద్ధిపై బీఆర్ఎస్ పాలనను ప్రస్తావించిన కేటీఆర్
రాష్ట్ర అప్పులపై సీఎం తప్పుడు ప్రచారం చేస్తున్నారన్న ఆరోపణ
రైతు బంధు బకాయిలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన బీఆర్ఎస్
ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని సీఎంకు సూచన
ఏ వేదికైనా చర్చకు సిద్ధమని బహిరంగ సవాల్
ఆరోపణలు నిరూపించలేకపోతే రాజకీయాల నుంచి తప్పకుంటానన్న కేటీఆర్
ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో అసంతృప్తి ఉందన్న వ్యాఖ్య
రాజకీయ విమర్శల కంటే పాలనపై దృష్టి పెట్టాలని హితవు



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ (K.T.R) సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి ఇటీవల చేసిన వ్యాఖ్యలకు స్పందించాల్సిన అవసరం ఏర్పడిందని చెబుతూ కేటీఆర్ తనదైన శైలిలో ప్రతిస్పందించారు. సీఎం రేవంత్ వాడుతున్న భాష, చేస్తున్న వ్యాఖ్యలు ఒక బాధ్యతాయుత పదవిలో ఉన్న వ్యక్తికి తగిన విధంగా లేవని విమర్శించారు. పనిచేయని నాయకులే ఎక్కువగా మాట్లాడుతారని, ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాల్సిన సమయంలో రాజకీయ మిగతా 2లో..



# ఖజానా పెంపుపై సర్కార్ నజర్

ఆదాయ వనరులపై సీఎం రేవంత్ రెడ్డి కీలక సమీక్ష
లీకేజీలు అడ్డుకోవాలని అధికారులకు ఆదేశం
రాష్ట్ర ఆదాయ సమీకరణపై సీఎం సమీక్ష
బడ్జెట్ లక్ష్యాల సాధనే ధ్యేయం
హెచ్ఎండీఏ, టీజీఐఐసీలకు కీలక బాధ్యతలు
ఆదాయ మార్గాలను పెంచడంపై ప్రత్యేక దృష్టి
వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, మైనింగ్ శాఖల్లో లీకేజీలకు చెక్
కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశం
ఆదాయ పెంపు పర్యవేక్షణకు ప్రత్యేక 'చేజింగ్ సెల్'
నిర్లక్ష్యం వహిస్తే ఊపేక్షించేది లేదని హెచ్చరిక
సంక్షేమ పథకాల్లో ఏఐ సాంకేతికత వినియోగం
అర్హుల జాబితా లబ్ధిదారులకు డీబీటీ అనుసంధానం
ఊహజనితంగా కాకుండా వాస్తవిక బడ్జెట్ రూపకల్పన
అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ఆదాయ వనరుల పెంపుదలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. రాబోయే బడ్జెట్‌కు అనుగుణంగా నిర్దేశించుకున్న ఆర్థిక లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించాలంటే రాష్ట్ర సొంత ఆదాయం గణనీయంగా పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీఎం స్పష్టం చేశారు. వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అందుతున్న ఆదాయ వివరాలను, భవిష్యత్తు ప్రణాళికలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఖజానాకు రావాల్సిన ప్రతి రూపాయి సకాలంలో చేరేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆర్థిక శాఖాధికారులను ఆదేశించారు.

రాష్ట్రానికి పెద్ద ఎత్తున ఆదాయాన్ని తెచ్చిపెట్టే కీలక సంస్థలైన హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ, తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ పనితీరుపై ముఖ్యమంత్రి ప్రత్యేకంగా చర్చించారు. ఈ రెండు సంస్థలు కేవలం భూముల కేటాయింపులకే పరిమితం కాకుండా, కొత్త ఆదాయ మార్గాలను అన్వేషించడంపై పూర్తి స్థాయిలో దృష్టి మిగతా 2లో..

# గ్రామీణ ఉపాధికి కొత్త చట్టం అమలు

పనిదినాలు 125కు పెంపు
నేటి నుంచి కొత్త ఉపాధి హామీ చట్టం అమల్లోకి
వంద రోజుల పనికి బదులు ఇక 125 రోజుల ఉపాధి
రోజువారీ కూలి రూ.300 నుంచి రూ.409 వరకు నిర్ణయం
సిక్కింలోని కొన్ని పంచాయతీలకు రూ.450 ప్రత్యేక వేతనం
21 రాష్ట్రాల్లో కనిష్ఠ కూలి రూ.300గా కేంద్రం నిర్ణయం
తెలంగాణలో రూ.308.. ఆంధ్రప్రదేశ్‌లో రూ.312 కూలి
దక్షిణ రాష్ట్రాల్లో వేతనాల పెంపు మూడు శాతం లోపే
కొన్ని ఉత్తర, ఈశాన్య రాష్ట్రాల్లో 15 శాతానికి పైగా పెంపు
కొత్త చట్టంతో వేతనాల సవరణకు కేంద్రం ఉత్తర్వులు



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్-గ్రామీణ్ చట్టం బుధవారం నుంచి అమల్లోకి వచ్చింది. ఈ కొత్త చట్టం ప్రకారం గ్రామీణ కార్మికులకు కల్పించే పనిదినాలను మిగతా 2లో..

# రెండో విడత రైతు భరోసా విడుదల

మూడు ఎకరాల్లోపు రైతులకు పెట్టుబడి సాయం
రెండో విడతలో 10.68 లక్షల మందికి లబ్ధి
నేరుగా రైతుల బ్యాంక్ అకౌంట్లలోకి రూ.1,590 కోట్లు
వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటన
26.50 లక్షల ఎకరాలకు అందిన ఆర్థిక సాయం
తొలి విడతలో రెండు ఎకరాల్లోపు రైతులకు ఊరట
రూ.2,482 కోట్ల నిధులు పంచిన తెలంగాణ సర్కార్
మొత్తం 54.96 లక్షల మంది అన్నదాతలకు అండ


**హైదరాబాద్, (డిడి9 వార్త):**

రాష్ట్రంలోని రైతులకు తెలంగాణ ప్రభుత్వం వరుసగా రెండో రోజు కూడా భారీ ఊరటనిస్తూ అదిరిపోయే గుడ్‌న్యూస్ చెప్పింది. వానాకాలం సాగు పనులు ఊపందుకుంటున్న తరుణంలో అన్నదాతలకు పెట్టుబడి కష్టాలు రాకూడదనే ఉద్దేశంతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతు భరోసా నిధుల విడుదలను వేగవంతం చేసింది. మంగళవారం నాడే మొదటి విడత మిగతా 7లో..




# టీఆర్ఎస్ పేరుపై ఉత్కంఠ

కవితకు చిక్కులు తప్పవా?
ఎన్నికల సంఘానికి వందలాది అభ్యంతరాలు
తెలంగాణ రక్షణ సేన పేరుపై కొనసాగుతున్న పరిశీలన
పేరును కేటాయించొద్దంటూ భారీ సంఖ్యలో వినతులు
ఆరు వందల నుంచి ఏడు వందల వరకు
అభ్యంతరాలు అందినట్లు సమాచారం
అధిక భాగం భారత్ రాష్ట్ర సమితి
నాయకులు, కార్యకర్తల నుంచే వినతులు
అభ్యంతరాలకు వివరణ ఇచ్చిన పార్టీ ప్రతినిధులు
మిగిలిన వినతుల ప్రతులు అందిస్తే
సమాధానం ఇస్తామన్న నాయకత్వం
ప్రతి అభ్యంతరాన్ని నిబంధనల ప్రకారం
పరిశీలిస్తున్న ఎన్నికల సంఘం
ఇరు వర్గాల వివరణల అనంతరం తుది నిర్ణయం
ఉత్తర ప్రత్యుత్తరాలు కొనసాగుతున్నాయని పార్టీ వర్గాల వెల్లడి
త్వరలో అనుకూల నిర్ణయం వస్తుందనే ఆశాభావం




**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ రక్షణ సేన పేరుపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. కల్వకుంట్ల కవిత ఏర్పాటు చేసిన కొత్త రాజకీయ పార్టీకి టీఆర్ఎస్ అనే సంక్షిప్త పేరును కేటాయించే అంశం ప్రస్తుతం కేంద్ర ఎన్నికల సంఘం పరిశీలనలో ఉంది. అయితే ఈ పేరును కేటాయించరాదంటూ పెద్ద ఎత్తున అభ్యంతరాలు ఎన్నికల సంఘానికి చేరినట్లు సమాచారం. తెలిసిన వివరాల ప్రకారం, టీఆర్ఎస్ పేరును కొత్త పార్టీకి ఇవ్వవద్దంటూ దాదాపు ఆరు వందల నుంచి మిగతా 2లో..

# రాముడి గుడిలోనే దొంగతనమా?

మోదీ, అమిత్ షాలపై జగ్గారెడ్డి ఆగ్రహం
అయోధ్య రామమందిరంలో
హుండీ డబ్బుల చోరీపై జగ్గారెడ్డి ఆగ్రహం
యూపీలో, కేంద్రంలో బీజేపీ
ఉన్నా దొంగతనం జరిగిందని మండిపాటు
ప్రజలకు మోదీ క్షమాపణ చెప్పాలని డిమాండ్

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

అయోధ్య శ్రీరామ మందిరంలో భక్తులు సమర్పించిన హుండీ డబ్బుల చోరీ ఘటనపై కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. యూపీలోనూ, కేంద్రంలోనూ బీజేపీ ప్రభుత్వమే ఉన్నా, రామాలయ ట్రస్ట్ వారి పరిధిలోనే నడుస్తున్నా... ఈ దొంగతనం జరిగిందని ఆయన అన్నారు. ఈ చోరీపై ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా స్పందించకపోవడం దారుణమన్నారు. ఇన్నేళ్లుగా రాముడి పేరును కేవలం



# ఖజానా పెంపుపై సర్కార్ నజర్

మొదటిపేజీ తరువాయి

సారించాలని ఆదేశించారు. నగర విస్తరణ, పారిశ్రామికాభివృద్ధికి అనుగుణంగా వనరులను సమర్థవంతంగా సమీకరిస్తూ ప్రభుత్వానికి అండగా నిలవాలని ఈ సంస్థల ఉన్నతాధికారులకు సూచించారు.

ప్రభుత్వానికి ప్రధాన వనరులుగా ఉన్న వాణిజ్య పన్నులు (కమర్షియల్ టాక్స్), ఎక్సైజ్ శాఖ, మైనింగ్ (గనుల) శాఖల నుంచి వస్తున్న రాబడిపై సీఎం రేవంత్ రెడ్డి ఆరా తీశారు. ఈ కీలక శాఖల్లో ఎక్కడా కూడా ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా, ఎలాంటి లీకేజీలు లేకుండా కచ్చితమైన నిఘా ఉంచాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పన్నుల వసూళ్లలో పారదర్శకత పెంచాలని, అక్రమాలకు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రాబడి పెంచే క్రమంలో ఎక్కడా రాజీ పడకూడదని తేల్చి చెప్పారు.

రాష్ట్ర ఆదాయాన్ని క్రమబద్ధీకరించడానికి మరియు వివిధ శాఖల మధ్య సమన్వయం పెంచడానికి ఒక ప్రత్యేక 'చేజింగ్ సెల్' ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఈ సెల్ నిరంతరం ఆదాయ వనరుల పురోగతిని, పన్నుల వసూళ్లను పర్యవేక్షిస్తుందని తెలిపారు. నిధుల సమీకరణ, ఆదాయం పెంపుదల విషయంలో అధికారులు ఎలాంటి నిర్లక్ష్యాన్ని వీడాల్సిందేనని, బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని గట్టిగా హెచ్చరించారు. ప్రతి శాఖ తమకు అప్పగించిన టార్గెట్లను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం కాకుండా నిజమైన లబ్ధిదారులకే సంక్షేమ ఫలాలు అందేలా సరికొత్త సాంకేతికతను ఉపయోగించాలని సీఎం నిర్ణయించారు. ఇందులో భాగంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత సహాయంతో లబ్ధిదారుల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అనర్హులను తొలగించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ నేరుగా వారి ఖాతాల్లోకే నగదు బదిలీ అయ్యేలా 'డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్' విధానానికి ఈ జాబితాను అనుసంధానం చేయాలని అధికారులను ఆదేశించారు. దీనివల్ల ప్రభుత్వ ధనం ఆదా అవ్వడంతో పాటు అవినీతికి తావుండదని పేర్కొన్నారు.

రాష్ట్ర ఆర్థిక ప్రణాళికలు ఎప్పుడూ ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. రాబోయే బడ్జెట్‌ను ఎలాంటి ఊహాజనిత అంకెలు, అంచనాలతో కాకుండా.. రాష్ట్ర ప్రస్తుత ఆర్థిక పరిస్థితులు, వాస్తవ రాబడులను ఆధారంగా చేసుకుని 'వాస్తవిక బడ్జెట్'గా రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అప్పుడే అనుకున్న పథకాలకు, పనులకు



నిధుల కొరత లేకుండా సజావుగా సాగుతుందని తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖలకు అవసరమైన అన్ని రకాల సాంకేతిక, పరిపాలనాపరమైన సహకారాన్ని అందించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందని సీఎం వెల్లడించారు.

రాష్ట్రంలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న వివిధ సాగునీటి, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేలా బడ్జెట్ ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టుల నిర్మాణంలో ప్రధాన అడ్డంకిగా మారిన భూసేకరణ ప్రక్రియకు బడ్జెట్‌లో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. భూములు కోల్పోతున్న రైతులకు, బాధితులకు సకాలంలో పరిహారం అందించి, పెండింగ్ పనులను వేగవంతం చేయడం ద్వారా ప్రాజెక్టుల ప్రయోజనాలను ప్రజలకు త్వరగా చేర్చవచ్చని అభిప్రాయపడ్డారు.

సచివాలయంలో జరిగిన ఈ కీలక ఆర్థిక సమీక్షా సమావేశంలో ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జాజు మరియు పలు శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలు పాల్గొన్నారు. రాష్ట్ర ఆర్థిక పురోభివృద్ధికి, నిధుల సమీకరణకు ముఖ్యమంత్రి ఇచ్చిన ఆదేశాల మేరకు కింది స్థాయి వరకు యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి, లీకేజీలు లేకుండా కఠినంగా వ్యవహరిస్తామని మంత్రులు, అధికారులు ఈ సందర్భంగా సీఎంకు వివరించారు.

# రెండో విడత రైతు భరోసా విడుదల

మొదటిపేజీ తరువాయి

కింద రెండు ఎకరాల లోపు భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతుల ఖాతాల్లో డబ్బులు వేసిన సర్కార్.. సరిగ్గా మరుసటి రోజైన బుధవారం నాటికి మూడు ఎకరాల లోపు భూమి కలిగిన రైతులకు కూడా నిధులు విడుదల చేసి వారి ముఖాల్లో ఆనందం నింపింది.

హైదరాబాద్ కేంద్రంగా బుధవారం జూలై 1న విడుదలైన ప్రభుత్వ సమాచారం ప్రకారం.. ఈ రెండో విడత రైతు భరోసా పంపిణీ ప్రక్రియ అత్యంత వేగంగా సాగింది. 2 ఎకరాల నుంచి 3 ఎకరాల వరకు సాగు భూమి కలిగి ఉండి, దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులైన రైతులందరి బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా నిధులు చేరిపోయాయి. ఈ విడత ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 10.68 లక్షల మంది రైతులకు నేరుగా ఆర్థిక సాయం అందింది. ఎలాంటి దళారులు, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రభుత్వం ఏకంగా రూ.1,590.02 కోట్ల భారీ మొత్తాన్ని ఒకేసారి రైతుల ఖాతాల్లోకి జమ చేసింది. రైతు భరోసా పథకం రెండో విడత నిధుల జమ విజయవంతంగా పూర్తయినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారికంగా వెల్లడించారు. తాము ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ రైతు సంక్షేమమే ధ్యేయంగా అడుగులు వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ విడతలో లబ్ధి పొందిన 10.68 లక్షల మంది రైతులకు చెందిన సుమారు 26.50 లక్షల ఎకరాల సాగు భూమిని లెక్కలోకి తీసుకుని, ఎకరాల ప్రాతిపదికన ఈ పెట్టుబడి సహాయాన్ని ప్రభుత్వం వారి చేతుల్లో పెట్టిందని మంత్రి స్పష్టం చేశారు. ఈ రెండో విడత పంపిణీ కంటే ముందే.. మంగళవారం తొలి విడతలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అత్యంత చిన్న కారు రైతులకు రేవంత్ సర్కార్ అండగా నిలిచింది. రెండు ఎకరాల వరకు మాత్రమే సాగు భూమి ఉండి, ఆర్థికంగా ఇబ్బందులు పడే 44.27 లక్షల మంది రైతులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చింది. ఆ మొదటి విడతలోనే అత్యధిక సంఖ్యలో ఉన్న రైతులకు మేలు చేస్తూ ఏకంగా రూ.2,482.02 కోట్ల నిధులను వారి అకౌంట్లలో వేసి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకుంది. తొలి విడత మరియు బుధవారం నాటి రెండో విడత నిధుల విడుదలను కలిపి చూస్తే తెలంగాణ ప్రభుత్వం కేవలం రెండు రోజుల్లోనే రికార్డు స్థాయిలో నిధుల పంపిణీ చేపట్టింది. ఈ రెండు విడతల ద్వారా రాష్ట్రంలోని మొత్తం 54.96 లక్షల మంది అన్నదాతలకు రైతు భరోసా సాయం అందినట్లయింది. వీరిందరి సాగు ఖర్చుల కోసం ప్రభుత్వం ఇప్పటివరకు ఖజానా నుంచి మొత్తం రూ.4,072.04 కోట్ల నిధులను విజయవంతంగా విడుదల చేసిందని వ్యవసాయ శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో తెలంగాణవ్యాప్తంగా సాగు పనులు ఊపందుకున్నాయి. విత్తనాలు కొనడానికి, ఎరువులు తెచ్చుకోవడానికి, పొలాలు దున్నడానికి రైతులకు తక్షణమే చేతిలో డబ్బులు అవసరమైన సమయం ఇది. ఇలాంటి కీలక తరుణంలోనే రేవంత్ సర్కార్ సరిగ్గా సమయానికి రైతు భరోసా డబ్బులను బ్యాంక్ అకౌంట్లలో జమ చేయడంతో రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోంది. ఈ పెట్టుబడి సాయం నేరుగా చేతికి అందడంతో వడ్డీ వ్యాపారుల దగ్గరకు వెళ్లే తిప్పలు తప్పాయని అన్నదాతలు సంతోషపడుతున్నారు. ఒకేసారి రాష్ట్రంలోని రైతులందరికీ ఒకే రోజు నిధులు విడుదల చేస్తే బ్యాంకింగ్ వ్యవస్థపై ఒత్తిడి పడి, సర్వర్లు నిలిచిపోవడం లేదా సాంకేతిక ఇబ్బందుల వల్ల సామాన్య రైతులకు ఇబ్బందులు ఎదురవుతాయని ప్రభుత్వం ముందుగానే ఊహించింది. అందువల్లనే రైతులకు ఎలాంటి తికమక లేకుండా, నిధుల పంపిణీ సులభంగా సాగేందుకు భూమి విస్తీర్ణం ఆధారంగా విడతల వారీగా ఈ సాయాన్ని విడుదల చేస్తున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వివరించారు. ఈ ప్రణాళిక వల్ల నిధుల బదిలీ ప్రక్రియ ఎక్కడా ఆగకుండా సజావుగా సాగుతోందన్నారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్క రైతుకూ ప్రభుత్వం ప్రకటించిన నిబంధనల మేరకు పెట్టుబడి సాయం అందించి తీరుతామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భరోసా ఇచ్చారు. ఇప్పటికే రెండు, మూడు ఎకరాల లోపు ఉన్న మెజారిటీ రైతుల ప్రక్రియ ముగిసిందని, ఇంకా మిగిలి ఉన్న మిగతా ఎకరాల రైతులకు కూడా ఇదే విధంగా దశలవారీగా, అత్యంత పారదర్శకంగా రైతు భరోసా నిధులు అకౌంట్లలో జమ చేసే పనులు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రైతుల సంక్షేమానికి ఈ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు.

# టీఆర్ఎస్ పేరుపై ఉత్కంఠ

మొదటిపేజీ తరువాయి

ఏడు వందల వరకు అభ్యంతరాలు ఎన్నికల సంఘానికి అందాయి. వీటిలో అధిక భాగం భారత్ రాష్ట్ర సమితి నాయకులు, కార్యకర్తలు, అనుచరులు పంపినవేనని సమాచారం. గతంలో ఇదే పేరుతో రాజకీయ ప్రస్థానం సాగిన నేపథ్యంలో, అదే పేరును మరో పార్టీకి కేటాయిస్తే ప్రజల్లో గందరగోళం నెలకొనే అవకాశం ఉందని వారు తమ అభ్యంతరాల్లో పేర్కొన్నట్లు తెలుస్తోంది.



మరోవైపు ఎన్నికల సంఘం నుంచి అందిన కొన్ని అభ్యంతరాలకు ఇప్పటికే తెలంగాణ రక్షణ సేన ప్రతినిధులు వివరణ ఇచ్చినట్లు సమాచారం. ఇంకా మిగిలిన అభ్యంతరాల ప్రతులను తమకు అందిస్తే వాటికీ సమగ్రంగా సమాధానం ఇస్తామని వారు ఎన్నికల సంఘానికి తెలియజేసినట్లు తెలిసింది.

అభ్యంతరాలు, వాటిపై ఇరు వర్గాలు సమర్పించిన వివరణలను పరిశీలించిన అనంతరం ఎన్నికల సంఘం తుది నిర్ణయం తీసుకోనుంది. ప్రస్తుతం ఎన్నికల సంఘంతో ఉత్తర ప్రత్యుత్తరాలు కొనసాగుతున్నాయని, నిబంధనలకు అనుగుణంగానే తమ దరఖాస్తు ఉందని, త్వరలోనే అనుకూల నిర్ణయం వెలువడుతుందనే ఆశాభావాన్ని తెలంగాణ రక్షణ సేన ప్రతినిధులు వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.

# రాముడి గుడిలోనే దొంగతనమా?

మొదటిపేజీ తరువాయి

రాజకీయాల కోసం, ఓటు బ్యాంక్ కోసమే బీజేపీ వాడుకుందని ఆయన విమర్శించారు. ఈ ఘటనపై విచారణకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎంపీల బృందాన్ని పంపనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ అన్ని మతాలను గౌరవిస్తుందని, ఈ వైఫల్యానికి గాను ప్రధాని మోదీ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



ఇదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేస్తున్న విమర్శలపై జగ్గారెడ్డి స్పందిస్తూ... కేటీఆర్ ప్రస్తుతం ఖాళీగా ఉండి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మాత్రం గత ప్రభుత్వం చేసిన అప్పులు తీరుస్తూ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్ వంటి హామీలను అమలు చేస్తూ పాలనలో బిజీగా ఉన్నారని చెప్పారు. కేటీఆర్ ఎన్ని విమర్శలు చేసినా రేవంత్ రెడ్డే సీఎంగా కొనసాగుతారని జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

# రేవంత్.. చర్చకు నేను రెడీ.. డేట్, టైమ్ ఫిక్స్ చేయండి

మొదటిపేజీ తరువాయి

విమర్శలకే పరిమితమవుతున్నారని ఆరోపించారు. తెలంగాణను తానే పాలిస్తున్న సీఎం రాష్ట్రాన్నే విమర్శించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వంతో సంబంధాల అంశాన్ని ప్రస్తావిస్తూ.. ఢిల్లీలో తెలంగాణకు గౌరవం లేదని చెప్పే ముఖ్యమంత్రి అక్కడికి పదేపదే ఎందుకు వెళ్తున్నారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేంద్రం నుంచి పెద్దగా సహకారం లేకపోయినా రాష్ట్ర అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేపట్టామని, సాగు విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచామని అన్నారు.



రాష్ట్ర అప్పుల విషయంలో కూడా ముఖ్యమంత్రి తప్పుడు ప్రచారం చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ అప్పులపై పార్లమెంట్‌లో అడిగిన ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వమే సమాధానం ఇచ్చిందని, తమ ప్రభుత్వం చేసిన అప్పుల వివరాలు అధికారికంగా నమోదయ్యాయని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం పరిపాలనలో విఫలమవడం వల్లే గత ప్రభుత్వంపై నిరంతరం విమర్శలు చేస్తున్నారని అన్నారు. రైతు బంధు పథకంపై కూడా ముఖ్యమంత్రి అసత్యాలు మాట్లాడుతున్నారని కేటీఆర్ విమర్శించారు. రైతులకు చెల్లించాల్సిన భారీ మొత్తాలు ఇంకా బకాయిగా ఉన్నాయని, వాటిని ఎప్పుడు చెల్లిస్తారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని వ్యాఖ్యానించారు.

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ సవాల్ విసిరారు. ఏ అంశంపైనైనా, ఎక్కడైనా చర్చకు తాను సిద్ధమని స్పష్టం చేశారు. టాపిక్, వేదిక ముఖ్యమంత్రి ఇష్టమని, తన ఆరోపణలను నిరూపించలేకపోతే తాను శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటానని ప్రకటించారు. అదే విధంగా సవాల్ చేసిన వ్యక్తి దానికి కట్టుబడి ఉండే ధైర్యం కూడా చూపించాలని అన్నారు. చివరగా సీఎం రాజకీయ భవిష్యత్తుపై వ్యాఖ్యానిస్తూ.. ప్రజల సమస్యలను విస్మరించి రాజకీయ ఆరోపణలకే పరిమితమైతే తీవ్ర రాజకీయ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని కేటీఆర్ హెచ్చరించారు.

# గ్రామీణ ఉపాధికి కొత్త చట్టం అమలు

మొదటిపేజీ తరువాయి

వంద రోజుల నుంచి 125 రోజులకు పెంచారు. అలాగే కొత్త చట్టం కింద చెల్లించే రోజువారీ కూలి రేట్లను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ప్రకటించింది.

కొత్త నిబంధనల ప్రకారం రోజువారీ వేతనాన్ని కనిష్ఠంగా రూ.300, గరిష్ఠంగా రూ.409గా నిర్ణయించారు. సిక్కింలోని మూడు ప్రత్యేక పంచాయతీల్లో మాత్రం రోజుకు రూ.450 చొప్పున కూలి చెల్లించనున్నారు.

దేశంలోని 21 రాష్ట్రాల్లో రోజువారీ కూలి రూ. 300గా నిర్ణయించారు. గుజరాత్, రాజస్థాన్, ఒడిశా, మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌తో పాటు పలు ఈశాన్య రాష్ట్రాలు ఈ జాబితాలో ఉన్నాయి.

తెలంగాణలో రోజువారీ కూలిని రూ.308గా, ఆంధ్రప్రదేశ్‌లో రూ.312గా నిర్ణయించారు. మహారాష్ట్రలో రూ.317, దాద్రా నగర్ హవేలీ, దమన్ దీవ్‌లలో రూ.340, తమిళనాడులో రూ.345, పుదుచ్చేరిలో రూ.347 చొప్పున చెల్లించనున్నారు. కర్ణాటకలో రూ.382, కేరళలో రూ.401, గోవాలో రూ.406 రోజువారీ కూలి అమల్లో ఉంటుంది.

వేతనాల పెంపులో రాష్ట్రాల మధ్య గణనీయమైన తేడా కనిపించింది. అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, బిహార్, ఝార్ఖండ్, అస్సాం, త్రిపుర, సిక్కిం, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో గత ఉపాధి హామీ పథకంతో పోలిస్తే వేతనాలు 15 శాతానికి పైగా పెరిగాయి. అయితే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుల్లో పెంపు మూడు శాతం కంటే తక్కువగా ఉండటం గమనార్హం. 2026-27 ఆర్థిక సంవత్సరానికి ఉపాధి హామీ పథకం కింద వేతనాలను కేంద్ర ప్రభుత్వం సవరించలేదు. కొత్త చట్టాన్ని అమల్లోకి తీసుకురావడమే లక్ష్యంగా వేతనాల ప్రకటనను వాయిదా వేసింది. ఇప్పుడు కొత్త చట్టం అమల్లోకి రావడంతో తాజా వేతనాలను ప్రకటించింది. గతంలో చివరిసారిగా 2025 మార్చి 27న ఉపాధి కూలి రేట్లను కేంద్రం సవరించింది.





## హున్సలో పల్లె దవాఖానను ప్రారంభించిన ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

**బోధన్, నిజామాబాద్ జులై 01(డీడీ9 వార్త):** సాలుర మండలంలోని హున్స గ్రామంలో ప్రభుత్వ సలహాదారులు, స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి బుధవారం పర్యటించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన పల్లె దవాఖానను ఆయన ఘనంగా ప్రారంభించారు. అంతకుముందు గ్రామంలో వెలసిన నూతన మహాలక్ష్మి మాత విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో గ్రామస్తులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్ సమస్యను వెంటనే పరిష్కరించాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. రైతులు పొలాలకు వెళ్లే మార్గం, కుమ్మన్‌పల్లి రోడ్డులో బ్రిడ్జ్ నిర్మాణానికి సంబంధించిన పనులను త్వరితగతిన చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామ దేవతల ఆలయాల ముందు సీసీ రోడ్ల నిర్మాణం, భీరప్ప మందిరం వద్ద కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అవసరమైన నిధులను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. పల్లె దవాఖాన, అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణాలకు తమ స్థలాలను దానంగా ఇచ్చిన దాతలను సర్పంచ్ మార్కల్ శివకుమార్, గ్రామస్తులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తహర్ బిన్ హందన్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, పీసీసీ డెలిగేట్ గంగా శంకర్, బోధన్ మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్ రెడ్డి, సాలురా పార్టీ అధ్యక్షులు మందర్నా రవి, ఏఎంసీ చైర్మన్ చీల శంకర్, నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


# ఘనంగా పదవి విరమణ కార్యక్రమం

**ఆదిలాబాద్ జిల్లా**
**తలమడుగు మండలం( డి డి 9 వార్త )**

తలమడుగు మండలం పునగుడ గ్రామంలో పదవి విరమణ కార్యక్రమం ఘనంగా జరిగింది. పునగూడ గ్రామపంచాయతీ పరిధిలో తొక్కిగుడ గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేసిన కుమర నారాయణకు గ్రామస్తులు పాఠశాల సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు

కుమ్ర నారాయణ గత నాలుగు శతాబ్దాలుగా ఉపాధ్యాయ వృత్తిలో విద్యార్థులకు సుదీర్ఘ సేవలందించి ఎందరో విద్యార్థులను ఉన్నత శిఖరాలకు అవరోధించి ఇంకెందరో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి. విద్యార్థుల పట్ల ప్రేమ అంకిత భావం. ఆయన విద్య బోధనలో చూపిన మార్గం ఉపాధ్యాయ వృత్తికి వన్నెతెచ్చిన వ్యక్తిగా పలువురు విద్యార్థులు కొనియాడారు

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డిప్యూటీ డి ఓ గోడం చందన్. ఏపీవో ఆత్రం భాస్కర్. పునగూడా ఆశ్రమ హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సరస్వతి. ప్రజా ప్రతినిధులు పిఎసిఎస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాజీ ఎంపీపీ సిడం రాము. పునాగుడా సర్పంచ్ పెందూర్ హనుమంతు. ఉపాధ్యాయులు మేస్త్రం త్రియంబక్ పేందూర్ ఆనంద్ రావు పేందూరు నాగోరావు డి ఆర్ డి ఓ సెల్స్ మెన్ పేందూర్ లక్ష్మణ్ విద్యార్థులు తల్లిదండ్రులు యువకులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు



# నిజామాబాద్‌లో 'ఆపరేషన్ ముస్కాన్-XII' ప్రారంభం

**నిజామాబాద్ జిల్లా జులై 01(డీడీ9 వార్త):**

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో తప్పిపోయిన, నిరాశ్రయులైన బాలలను గుర్తించి వారి కుటుంబాలతో పునఃకలయిక చేయడమే లక్ష్యంగా 'ఆపరేషన్ ముస్కాన్XII' కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా ప్రారంభించారు. పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆదేశాల మేరకు కమిషనరేట్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని అదనపు డీసీపీ (అడ్మిన్) ఎన్.శుభం ప్రకాష్ ప్రారంభించారు. ఈ నెల 1 నుంచి 31 వరకు నెల రోజుల పాటు సాగే ఈ కార్యక్రమంలో పోలీసు శాఖతో పాటు మహిళా, శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, విద్యాశాఖ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, ఇతర స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయనున్నాయని ఆయన తెలిపారు.




రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్లు, మార్కెట్లు, హోటళ్లు, ధాబాలు, పరిశ్రమలు, ఇటుక బట్టీలు, గ్యారేజీలు, నిర్మాణ ప్రాంతాలు, పర్యాటక ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టి బాల కార్మికులను, వీధి బాలలను రక్షించి సంబంధిత అధికారుల సమక్షంలో పునరావాసం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. చిన్నారులను పనుల్లో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఎక్కడైనా



బాల కార్మికులు లేదా తప్పిపోయిన చిన్నారులు కనిపిస్తే నిజామాబాద్ డివిజన్ ఇన్‌ఛార్జి ఎస్సై 8712578236, ఆర్మూర్ డివిజన్ ఇన్‌ఛార్జి ఎస్సై 8712659863, బోధన్ డివిజన్ ఇన్‌ఛార్జి ఎస్సై 9985197899 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ పాండేరావు, ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ ఏ.సురేష్, జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్ సౌందర్య, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ చైతన్య, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ప్రభుదాస్, ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కల్పన, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వైద్యులకు సైబర్ భద్రతపై అవగాహన

**నిజామాబాద్ జిల్లా జులై 01(డీడీ9 వార్త):**

జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా నిజామాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్య కళాశాల, మేఘనా డెంటల్ కళాశాలల్లో "సైబర్ జాగ్రూకత దివస్" అవగాహన కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజ ఆరోగ్య పరిరక్షణలో విశేష సేవలందిస్తున్న వైద్యులను సైబర్ క్రైమ్ పోలీసులు శాలువా, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ... నేటి డిజిటల్ యుగంలో వైద్యులు, వైద్య విద్యార్థులు సైబర్ నేరస్థుల లక్ష్యంగా మారుతున్నారని హెచ్చరించారు. ఆసుపత్రులు, వైద్య సంస్థలు, వ్యక్తిగత బ్యాంకు ఖాతాలు, డిజిటల్ లావాదేవీల ద్వారా జరుగుతున్న మోసాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బాస్ స్కామ్, ప్రకటనల పేరుతో జరిగే మోసాలు, గుర్తింపు చోరీ, క్రెడిట్, డెబిట్ కార్డు మోసాలు, డిజిటల్ అరెస్ట్, ఫిషింగ్, క్యూఆర్ కోడ్, యూపీఐ, ఏపీకే ఫైల్ మోసాల గురించి వివరించారు. వైద్యులు తమ వ్యక్తిగత సమాచారం, ఆధార్, పాన్, బ్యాంకు వివరాలు, ఓటీపీ, పాస్‌వర్డ్‌లు, యూపీఐ పిన్ వంటి గోప్యమైన వివరాలను అపరిచిత వ్యక్తులతో పంచుకోవద్దని హితవు పలికారు. అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని, తెలియని మొబైల్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవద్దని సూచించారు. ఒకవేళ సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయడం లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని పేర్కొన్నారు. ఈ విషయాలను తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా వివరించి అందరూ అప్రమత్తంగా ఉండేలా సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ రమణారావు, ఎస్సైలు ప్రవళిక, రవి నాయుడుతో పాటు 560 మంది వైద్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# నిజామాబాద్‌లో 15 రోజుల పాటు ఆంక్షలు అమలు

**నిజామాబాద్ జిల్లా జులై 01(డీడీ9 వార్త):**

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో కఠిన నిబంధనలు అమలులో ఉంటాయని ఆయన ప్రకటించారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే ప్రాంతాల్లో విగ్రహాల ఏర్పాటును నిషేధించినట్లు, అనుమతుల కోసం కలెక్టర్ కమిటీని సంప్రదించాలని స్పష్టం చేశారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు డీజేల వినియోగంపై పూర్తిస్థాయి నిషేధం విధించామని, ఇతర సమయాల్లో కూడా శబ్ద కాలుష్య నియంత్రణ పాటించాలని సూచించారు. 500 మందికి పైగా సభలు, ఊరేగింపుల కోసం 72 గంటల ముందే పోలీసుల అనుమతి తప్పనిసరి అని తెలిపారు. అనుమతి లేని డ్రోన్ల వినియోగం, బహిరంగ



ప్రదేశాల్లో మద్యం సేవించడం, మైనర్లు 'ఏ' సర్టిఫికేట్ సినిమాలను చూడటంపై నిషేధం విధించారు. నకిలీ గల్ఫ్ ఏజెంట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులకు ఇళ్లు అద్దెకు ఇచ్చే ముందు పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఫీజు బకాయిల విడుదల కోసం నేడు విద్యాసంస్థల బంద్: బీసీ జేఏసీ

**నిజామాబాద్ జిల్లా జులై 01(డీడీ9 వార్త):**

రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, పాత పద్ధతిలోనే పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ గురువారం రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ బంద్ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని పిలుపునిస్తూ నిజామాబాద్ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ బుధవారం విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ... ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే క్రమంలో ఈ నిర్ణయం తీసుకున్నామని, రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి సంఘాల మద్దతుతో ఈ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ బంద్‌లో భాగంగా ఇంటర్, డిగ్రీ, పీజీ, బీఈడీ, ఫార్మసీ, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, ఫిజియోథెరపీతో పాటు అన్ని రకాల వృత్తి విద్యా కళాశాలలను మూసివేసి యాజమాన్యాలు సంపూర్ణంగా సహకరించాలని కోరారు. గత నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వం ఫీజు బకాయిలను విడుదల చేయకపోవడం వల్ల వేలాది మంది విద్యార్థుల చదువులు ప్రమాదంలో పడ్డాయని, ఆర్థిక భారం పెరిగి యాజమాన్యాలు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ నిధులను విడుదల చేయడంతో పాటు, ప్రస్తుతం విద్యార్థులపై కత్తిలా వేలాడుతున్న పదివేల ర్యాంకు నిబంధనను పూర్తిగా ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీ జేఏసీ నగర అధ్యక్షులు దర్శనం దేవేందర్ మాట్లాడుతూ... బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ ఉద్యమాన్ని చేపడుతున్నామని, కళాశాలల యాజమాన్యాలన్నీ రేపు స్వచ్ఛందంగా కళాశాలలకు సెలవు ప్రకటించి, విద్యార్థుల పక్షాన నిలబడాలని కోరారు. చదువుకునే విద్యార్థులకు భరోసా కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ప్రభుత్వం మొండి వైఖరి వీడే వరకు ఈ ఆందోళనలు కొనసాగుతాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు నాయకులు కొయ్యాడ శంకర్, చంద్రకాంత్, శ్రీలత, బగ్గలి అజయ్, లక్ష్మణ్ గౌడ్, రేఖ, అవుసుల రాము తదితరులు పాల్గొన్నారు.



# బొడ్రాయి ప్రతిష్ట కార్యక్రమానికి హాజరైన టిఆర్పి నాయకుడు

**ములుగు, జూలై 1, డీ డీ 9 వార్త :**

జయ శంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలోని పుల్లూరి రామయ్య పల్లి గ్రామంలో భూలక్ష్మి, మహాలక్ష్మి, బొడ్రాయి ప్రతిష్ట పండుగ కార్యక్రమానికి తెలంగాణ రాజ్యాధికార పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు త విటీ దిలీప్ కుమార్ దంపతులు హాజరయ్యారు. పూజా కార్యక్రమంలో పాల్గొని తమ భక్తి భావాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో పూజారులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం : ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి

**బోధన్, నిజామాబాద్ జులై 01(డీడీ9 వార్త):**

మహిళలు ఆర్థికంగా స్వాలంబన సాధించాలనే సంకల్పంతో ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, బోధన్ నియోజక వర్గ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. బోధన్ పట్టణంలోని ఏఆర్ గార్డెన్‌లో బుధవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హజరై లబ్ధిదారులైన మహిళలకు కుట్టుమిషన్లు, ఇందిరమ్మ చీరలను అందజేశారు. మహిళలు సొంతంగా ఉపాధి పొంది, ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఈ కుట్టుమిషన్లు ఎంతో దోహదపడతాయని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పద్మజ శరత్ రెడ్డి, కౌన్సిలర్లు దాము, లక్ష్మీ రామ్మూర్తి, ఉర్దూ అకాడమీ చైర్మన్ ఉజాన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నాగేశ్వరరావు, టౌన్ అధ్యక్షులు దాము, మున్సిపల్ కమిషనర్ కృష్ణ జాదవ్, ఎమ్మార్వో విట్టల్, రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపల్ ఇంతియాజ్, ఆదినారాయణ, ఎంఏ బషీర్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, మహిళా లబ్ధిదారులు పాల్గొన్నారు.




# ఎస్సారెస్పీ వైపు బాబ్లీ నీరు... 14 గేట్ల ద్వారా విడుదల

**బోధన్, నిజామాబాద్ జులై 01(డీడీ9 వార్త):**

మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ధర్మాబాద్ సమీపంలో గోదావరి నదిపై నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లు బుధవారం తెరుచుకున్నాయి. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రతి ఏటా జులై 1న ప్రాజెక్టు గేట్లు ఎత్తాలన్న నిబంధన ప్రకారం, ఇరు రాష్ట్రాల నీటిపారుదల శాఖ అధికారులు, కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) ప్రతినిధుల సమక్షంలో ఈ ప్రక్రియను చేపట్టారు. ప్రాజెక్టుకు సంబంధించిన 14 గేట్లను అధికారులు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ఈ గేట్లు అక్టోబర్ 28 వరకు తెరిచి ఉంటాయని అధికారులు వెల్లడించారు. జూన్ 30న ప్రాజెక్టు వద్దకు చేరుకున్న తెలంగాణ, మహారాష్ట్ర అధికారులు అర్ధరాత్రి దాటిన తర్వాత గేట్లు ఎత్తారు. ప్రస్తుతం దిగువకు 0.2 టీఎంసీల నీరు ఎస్సారెస్పీ వైపు వస్తోందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చరణ్, జూనియర్ ఇంజినీర్లు సాయి ప్రణీత్, ప్రకాష్, మహారాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారులు బన్సోద్, ఓత్‌దార్, గవాయి, ఎస్సారెస్పీ ఏఈఈలు కొత్త రవి, శ్యాం కుమార్, విన్యాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు బురదమయం ప్రయాణం నరక ప్రయం

**అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం( డి డి 9 వార్త )**

తలమడుగు మండలం డోర్లి రైల్వే వంతెన క్రింద గత రాత్రి కురిసిన వర్షానికి రోడ్ అంతా బురద మయమైందని ప్రయాణికులు వాపోతున్నారు ప్రతినిత్యం ఈ దారి గుండా పలు గ్రామాల ప్రజలు తలమడుగు మండల కేంద్రానికి వస్తూ పోతుంటారు ఈ దారి గుండా బురదలో ద్విచక్ర వాహనదారులు పాదాచారులు నరకం అనుభవిస్తున్నామని. ఆవేదన వ్యక్తం చేశారు ఏదైనా ప్రమాదం జరగకముందే సంబంధిత రైల్వే అధికారులు. తక్షణమే స్పందించి బురదను తొలగించాలని వేడుకుంటున్నారు




# ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయొద్దు

- **ఎన్పీఆర్డీ, రైతు సంఘం డిమాండ్**

**బోధన్, నిజామాబాద్ జులై 01(డీడీ9 వార్త):**

ఉపాధి హామీ పథకాన్ని దెబ్బతీసేలా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త నిబంధనలను వెంటనే ఉపసంహరించుకోవాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక, తెలంగాణ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం బోధన్ మండలంలోని బండార్పల్లి, పెద్ద మావంది కలాన్ గ్రామాల్లో సర్పంచులు కాడి సాయిలు, శకుంతలకు వారు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎన్పీఆర్డీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏషాల గంగాధర్, జిల్లా అధ్యక్షులు గైని రాములు, రైతు సంఘం నాయకులు పులి ముత్తన్న మాట్లాడుతూ.. జులై 1 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త నిబంధనలు కూలీల ఉపాధిని దెబ్బతీసేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం 90 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం నిధులను భరిస్తూ పథకాన్ని పాత పద్ధతిలోనే పటిష్టంగా అమలు చేయాలని వారు కోరారు. ఉపాధి కూలీలకు రోజువారీ వేతనాన్ని 600 రూపాయలకు పెంచాలని, విద్యుత్ సవరణ చట్టం, లేబర్ కోడ్‌స్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వికలాంగులు, వృద్ధులు, వితంతువులకు నెలకు పదివేల రూపాయల చొప్పున పెన్షన్ ఇవ్వాలని, ఇళ్ల నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో ఐదు లక్షల రూపాయల చొప్పున సాయం అందించాలని కోరారు. స్థలం లేని నిరుపేదలకు స్థలాలను కేటాయించి ఇళ్లు నిర్మించాలని, అర్హులైన వికలాంగులందరికీ అంత్యోదయ కార్డులతో పాటు కొత్త దరఖాస్తుదారులకు వెంటనే పింఛన్లు మంజూరు చేయాలని వారు స్పష్టం చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం కేంద్ర ప్రభుత్వంపై పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్ గౌడ్, విజయ, మొహమ్మద్ వహీద్, లక్ష్మ గౌడ్, నాగనాథ్ పటేల్, రాములు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తే సహించం

**బోధన్, నిజామాబాద్ జులై 01(డీడీ9 వార్త):**

కేంద్ర ప్రభుత్వం జులై 1వ తేదీ నుంచి తీసుకువచ్చిన కొత్త చట్టాలను, నిబంధనలను నిరసిస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం డివిజన్ ఆర్‌డీవో కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహించారు. సీఐటీయూ, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక సంయుక్తంగా చేపట్టిన ఈ ఆందోళనలో భాగంగా ఆర్‌డీవో కార్యాలయంలో ఏవో సాయిలుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జె.శంకర్ గౌడ్, ఎన్పీఆర్డీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏషాల గంగాధర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఉపాధి హామీ పథకాన్ని దెబ్బతీసేలా కేంద్రం కుట్ర చేస్తోందని మండిపడ్డారు. గతంలో ఉపాధి నిధులు కేంద్రం 90 శాతం, రాష్ట్రం 10 శాతం భరించే పద్ధతిని మార్చి, కేంద్రం 60, రాష్ట్రం 40 శాతంగా చేయడం కూలీల పొట్ట కొట్టడమేనని వారు విమర్శించారు. ఫోటో క్యాప్స్ పేరుతో కూలీలకు పని లేకుండా చేస్తున్నారని, వెంటనే పాత పద్ధతిలోనే ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

లేబర్ కోడ్స్, విద్యుత్ సంస్కరణ చట్టాలను రద్దు చేయాలని, రైతులకు కనీస మద్దతు ధర కల్పించాలని వారు కోరారు. వికలాంగులకు కేంద్రం 5 వేల రూపాయలు, రాష్ట్ర ప్రభుత్వం 6 వేల రూపాయల చొప్పున పెన్షన్ అందించాలని వారు డిమాండ్ చేశారు. కేంద్రం తన మొండి వైఖరిని వీడకపోతే గల్లీ నుంచి ఢిల్లీ వరకు అన్ని ప్రజా సంఘాలను కలుపుకొని దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్ర నిర్ణయాన్ని వ్యతిరేకించి, పాత పద్ధతిలోనే పథకాన్ని అమలు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్పీఆర్డీ జిల్లా అధ్యక్షులు గైని రాములు, డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు దాసి గోపి, ఎన్పీఆర్డీ జిల్లా ఉపాధ్యక్షులు కాలగడ్డ రాజు, సహాయ కార్యదర్శి ముంజం సాయిలు, కమిటీ సభ్యులు రైముద్దీన్, ఆరిఫ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.






# నిరుపేదలకు ఇండ్ల పట్టాలివ్వాలి

- **నిజామాబాద్ కలెక్టరేట్ వద్ద వామపక్షాల ధర్నా**

**నిజామాబాద్ జిల్లా జులై 01(డీడీ9 వార్త):**

నిరుపేదలకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని, అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. రాష్ట్రవ్యాప్త ఆందోళనల్లో భాగంగా సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎం.ఎల్) మాస్‌లైన్, న్యూడెమోక్రసీ, ఆర్ఎస్పీ పార్టీల నాయకులు ఈ నిరసనలో పాల్గొన్నారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అడిషనల్ కలెక్టర్ భుజంగరావుకు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి పి. సుధాకర్, సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రమేష్ బాబు, సీపీఐ(ఎం.ఎల్) మాస్‌లైన్ నగర కార్యదర్శి ఎం.సుధాకర్, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వరదయ్య, ఆర్ఎస్పీ జిల్లా కార్యదర్శి రాములు మాట్లాడుతూ.. 'గుడిసెలు లేని రాజ్యం తెస్తామని' హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పేదలను విస్మరిస్తోందని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల బిల్లులను వెంటనే విడుదల చేయాలని, నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్రూం ఇళ్లను అర్హులైన పేదలకు కేటాయించాలని వారు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఐదు లక్షలకు, కేంద్ర ప్రభుత్వం ఇచ్చే మరో ఐదు లక్షలను కలిపి మొత్తం పది లక్షల రూపాయలు అందించాలని, అలాగే ఏళ్లుగా ప్రభుత్వ భూముల్లో నివాసముంటున్న పేదలకు పట్టాలు పంపిణీ చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్పొరేట్ కంపెనీలకు వేలాది ఎకరాలు ఉదారంగా అప్పగిస్తున్న ప్రభుత్వం, పేదల విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని నాయకులు మండిపడ్డారు. గత ప్రభుత్వం లాగే ఇప్పుడు కూడా పేదలను మోసం చేస్తే ఊరుకునేది లేదని, రాబోయే రోజుల్లో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఓమయ్య, రఘురాం, లింగం, విటల్, పెద్ది వెంకటరాములు, సుజాత, శివరాజ్, గంగారెడ్డి, అనిల్, నరేష్, అమూల్య, రఫీక్, సాయిలు, కిరణ్, సృజన్, గంగాధర్, లక్ష్మి, నారాయణ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ములుగులో ఉచిత కుట్టుమిషన్ శిక్షణ

- **సీతక్క ఆదేశాలతో వెనుకబడిన మహిళలకు స్వయం ఉపాధి మార్గం.**
- **ఫీజు లేకుండా కుట్టుమిషన్ శిక్షణ, సర్టిఫికెట్లతో మహిళల జీవితాల్లో వెలుగు**
- **ములుగులో కాంగ్రెస్ కార్యక్రమం.**
- **స్వయంగా బ్రతికేలా చేయూత: మదర్ సొసైటీతో కలిసి ములుగులో మహిళలకు ఉచిత శిక్షణ.**

**మంగపేట జులై 01డీడీ 9 వార్త**

ములుగు మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ములుగు జిల్లాలో వెనుకబడిన మహిళల ఆర్థిక సాధికారత కోసం ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఎవరిపైనా ఆధారపడకుండా, తమ కుటుంబాలను తామే పోషించుకునేలా మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ శిక్షణకు ఎలాంటి ఫీజు వసూలు చేయడం లేదు. శిక్షణ పూర్తయిన అనంతరం మహిళలకు సర్టిఫికెట్లు అందజేసి, వారి జీవితాల్లో ఆనందం నింపేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. రేగ కళ్యాణి మార్కెట్ కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు భాగ్య అక్క, అనిత మల్లురి, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షురాలు సుగ్యాల పుష్పావతి మరియు శ్రీ మల్లూరు హిమాచల లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం చైర్మన్ సురేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మదర్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ వ్యవస్థాపకురాలు సంధ్య రెడ్డి స్వయంగా పాల్గొన్నారు. ములుగు జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున మహిళలకు శిక్షణ ఇప్పించి, వారిని స్వయం ఉపాధి పొందేలా చేసే బాధ్యత తమదేనని సంధ్య రెడ్డి స్పష్టం చేశారు. మంత్రి సీతక్కకి ఇచ్చిన మాట ప్రకారం ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లి, మాట నిలబెట్టుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. కుటుంబ పోషణ భారం మహిళలపై పడకుండా, వారికి ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం కల్పించే దూరదృష్టితో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నాయకులు వెల్లడించారు.




# ఆపదలో అండగా ప్రాణదాత అంబులెన్స్..

- **అత్యవసర పరిస్థితుల్లో ఉన్న నిరుపేదలకు ఆపన్నహస్తం.**

**మణుగూరు.జూలై 1(డి డి 9వార్త)**

భద్రాద్రి జిల్లా, మణుగూరు పట్టణంలో మేము సైతం మిత్రమండలి చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రాణదాత ఉచిత అంబులెన్స్ బుధవారం నాడు మరో నిరుపేద కుటుంబానికి అండగా నిలిచింది.వివరాల్లోకి వెళితే పగిడేరు గ్రామానికి చెందిన పి. నిఖిల్ కుమార్ (48) కు రక్తకణాలు తగ్గిపోవడంతో పరిస్థితి విషమించింది. దాంతో డాక్టర్ గారి సలహా మేరకు మణుగూరు సాయి మమత హాస్పిటల్ నుండి భద్రాచలం లోని కిమ్స్ హాస్పిటల్‌కు తీసుకుని వెళ్ళడం జరిగింది. ఆపద సమయంలో ఆదుకొని వెంటనే అంబులెన్స్‌ను ఏర్పాటు చేసిన నిర్వాహకులకు పేషెంట్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేస్తూ కన్నీటి పర్యంతం అయ్యారు. ఈ సందర్భం



గా మేము సైతం మిత్రమండలి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు మాట్లాడుతూ.. ఈరోజు వరకు 447 మందిని సురక్షితంగా,ఉచితంగా హాస్పిటల్ లలో చేర్చడం జరిగిందనీ,భవిష్యత్తులో కూడా నిరుపేదలకు ఆపద సమయంలో మా ప్రాణదాత అంబులెన్స్ అండగా ఉంటుందని తెలిపారు.

# అనుమతులు మాయి... అజమాయిషీ మరొకరిదా..

- **శ్రీరామ మహిళా ఇసుక సొసైటీ సభ్యుల ఆవేదన.**

**మణుగూరు.జులై 1(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక మండలంలోని దుగినేపల్లి పంచాయతీ,వీరాపురం పరిధిలో గల ఇసుక క్వారీలో జరుగుతున్న పరిణామాలతో సొసైటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో దుగినేపల్లి పంచాయతీలో చెగర్సల, టీ కొత్తగూడెం, రామవరం ఉమ్మడి పంచాయతీలో ఉండేవి. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో పంచాయతీలు విభజన జరగడం తెలిసిందే. ఉమ్మడి పంచాయతీ గా ఉన్నప్పుడు గిరి లక్ష్మి సొసైటీ పేరుతో ఈ పంచాయతీ ప్రజలు సొసైటీని నిర్వహించడం జరిగింది. పంచాయతీలు వేరుగా ఏర్పడిన తర్వాత దుగినేపల్లి పంచాయతీ పరిధిలో వీరాపురం రెవిన్యూ గ్రామం నుండి కొత్తగా శ్రీరామ మహిళా ఇసుక సొసైటీని ఏర్పాటు చేసి దీనికిగాను అన్ని రకాల అనుమతులు అనగా టి ఎస్ ఎం డి సి, ఐటీడీఏ పీవో, పినపాక తాసిల్దార్, దుగినేపల్లి గ్రామపంచాయతీ అధికారికంగా తీర్మానం చేసుకోవడం జరిగినది. ఈ ర్యాంపుకు ఒక్క లక్ష 85 వేల క్యూబిక్ మీటర్ల ఇసుక తవ్వకాలకి పైన తెలిపిన అధికారులు అనుమతులు ఇవ్వడం జరిగింది. అనంతరం ఈ ఇసుక క్వారీలో పనులు నిర్వహిస్తుండగా ప్రక్క పంచాయతీ వారైనటువంటి గిరి లక్ష్మి సొసైటీ వారు సొంత పెత్తనంతో నిరంతరం అడ్డుపడుతూ మా పనులకు ఆటంకం కలిగిస్తున్నారు. కనుక సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మా శ్రీరామ మహిళా ఇసుక క్వారీ సభ్యులకు న్యాయం చేయాలని వారు వేడుకుంటున్నారు.





# పద్మశ్రీ వనజీవి రామయ్య జయంతి వేడుకలు..

- **ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఒక మొక్క నాటాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పిలుపు..**

**మణుగూరు.జూలై 1(డి డి 9వార్త)**

పద్మశ్రీ వనజీవి రామయ్య జయంతి సందర్భంగా మణుగూరు మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శ్రీ మొల్ల స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన జయంతి వేడుకల్లో పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వనజీవి రామయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో విద్యార్థులు, అధ్యాపకులు, స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులతో కలిసి ఆయన స్వయంగా మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పద్మశ్రీ వనజీవి రామయ్య తన జీవితాన్ని ప్రకృతి పరిరక్షణకు అంకితం చేసి లక్షలాది మొక్కలను నాటి పచ్చదనాన్ని విస్తరించారని కొనియాడారు. ఆయన సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి ఒక్క వ్యక్తి ఒక మొక్కను నాటడాన్ని తమ ప్రథమ బాధ్యతగా స్వీకరించాలని, కేవలం మొక్కలు నాటడమే కాకుండా నాటిన ప్రతి మొక్కనూ కంటికి రెప్పలా సంరక్షించాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గారు ప్రత్యేకంగా పిలుపునిచ్చారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి భుజస్కంధాలపై ఉందన్నారు.

ప్రస్తుత పరిస్థితుల్లో పర్యావరణ పరిరక్షణ అత్యంత అవసరమని, చెట్లు పెరిగితేనే స్వచ్ఛమైన గాలి, సమృద్ధిగా వర్షాలు, ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. విద్యార్థులు ప్రకృతిని ప్రేమించి, పర్యావరణ పరిరక్షణలో ముందుండాలని, సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.


అనంతరం కళాశాల విద్యార్థులతో ఆప్యాయంగా మాట్లాడిన ఎమ్మెల్యే వారి విద్యాభ్యాసం, భవిష్యత్ లక్ష్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యతో పాటు సామాజిక బాధ్యతలను కూడా అలవర్చుకోవాలని, అందులో ముఖ్యంగా పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేయాలని ఆయన ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో శ్రీ మొల్ల స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు మరియు పలువురు పాల్గొన్నారు.



# పేద కుటుంబానికి అండగా... రూ.5.20 లక్షల ఎల్ఓసీ అందజేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.

**మణుగూరు.జూలై 1 (డి డి 9వార్త)**

భద్రాద్రి జిల్లా,అశ్వాపురం మండలానికి చెందిన మొహమ్మద్ ఫర్జానా బేగంకు వైద్య చికిత్స నిమిత్తం మంజూరైన రూ.5 లక్షల 20 వేల రూపాయలు విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (LOC)ను పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. పేద ప్రజలు డబ్బుల కొరత కారణంగా వైద్య చికిత్సకు దూరం కాకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో ఆర్థిక సహాయం అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, వైద్య అవసరాల కోసం ఎవరూ ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. అర్హులైన ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మొహమ్మద్ ఫర్జానా బేగం ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ తన వంతు సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఓరిగంటి బిక్షమయ్య, కాంగ్రెస్ నాయకులు బేతం రామకృష్ణ, గాదె కేశవరెడ్డి, ఊస అనిల్, తూము పెద్ద రాఘవులు, ఆవుల రవి, బచ్చు వెంకటరమణ, బురెడ్డి వెంకటరెడ్డి, సుంచు ఏకాంబరం, బారాసు సంపత్, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు మరియు పలువురు పాల్గొన్నారు.



# పివి కాలనీ సింగరేణి కార్మికులకు గ్యాస్ డోర్ డెలివరీ చేయాలి.

- **గ్యాస్ సిలిండర్ పై అదనపు వసూళ్లను అరికట్టాలి.**
- **బ్రాంచ్ కార్యదర్శి కామ్రేడ్ వై రాంగోపాల్.**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు సింగరేణి.**

మణుగూరు పివి కాలనీలో ఉన్న హెచ్ పి గ్యాస్ సింగరేణి సూపర్ బజార్ నుండి డోర్ డెలివరీ కావలసిన గ్యాస్ సిలిండర్లను సకాలంలో ఇంటికి డోర్ డెలివరీ చేయవలసిన గ్యాస్ ఏజెన్సీలు డోర్ డెలివరీ చేయకపోగా 981 బదులుగా ఒక 1030 రూపాయలు కార్మికుల నుండి అక్రమంగా వసూలు చేస్తున్నారు. విధి లేని పరిస్థితిలో తప్పనిసరిగా గ్యాస్ తీసుకోవలసివస్తుంది ఈ మోసాన్ని గ్రహించిన ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ కామ్రేడ్ వై రాంగోపాల్ బృందం ఎస్ ఓ టు జి ఎం D.రామారావు సమక్షంలో గ్యాస్ ఏజెన్సీ వారిని నిలదీయడం జరిగింది.కేవలం మణుగూరు ఏరియాలోని సింగరేణి కార్మికులకు మాత్రమే ఈ ఇబ్బందులు ఎందుకు? మేనేజ్మెంట్ వెంటనే చర్యలు చేపట్టాలి. దీనికి కారణమైన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి. గతంలోనే ఎస్ ఓ టు జి ఎం శ్రీనివాస చారి, ఏజీఎం పర్సనల్ సెలగల రమేష్ సమక్షంలో అభిరామ్ గ్యాస్ ఏజెన్సీ వారిని మందలించడం జరిగిందని అయినా వారి పద్ధతి మార్చుకోవడం లేదని వెంటనే ప్రభుత్వ అధికారులు, సివిల్ సప్లైవారు గ్యాస్ డోర్ డెలివరీ కి 981 రూపాయలకు బదులుగా 1030 రూపాయలు అక్రమంగా వసూలు చేస్తున్న అభిరామ్ గ్యాస్ ఏజెన్సీ వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఏఐటీయూసీ నుండి డిమాండ్ చేస్తున్నాం అని ఆయన అన్నారు.



# ఇబ్రహీంపూర్ చెరువులో అక్రమ నిర్మాణాలు: ఇరిగేషన్ శాఖ హెచ్చరిక

**జనగామ జులై 1(డిడి 9వార్త )బ్యూరో**

రఘునాథపల్లి మండలం ఇబ్రహీంపూర్ పెద్ద చెరువును డీఈ అరుణ్ జ్యోతి, ఏఈ సింధుతో కలిసి పరిశీలించారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని ముదిరాజ్ కమ్యూనిటీ భవనం, పెద్దమ్మ గుడి, కొన్ని నివాస గృహాలు అనుమతులు లేకుండా నిర్మించబడినవేనని అధికారులు తెలిపారు. చెరువు పరిధిలో కొత్త నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మత్తడికి అడ్డంకులు కల్పించడం వల్ల కట్టకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని సూచించారు. చెరువు మత్తడి, తూము మరమ్మతులకు రూ.13 లక్షలు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పోకల శ్రీనివాస్ ,ఉప సర్పంచ్ చింత నరేష్, కారోబార్ యూసఫ్, పండుగ నవీన్, నూనె మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.





# మురుమూరు పంచాయతీలో రూ.30 లక్షల సీసీ రోడ్లకు శంకుస్థాపన





**వాజేడు జూలై 1 (డిడి9 వార్త):**

ములుగు జిల్లా వాజేడు మండలంలోని మురుమూరు గ్రామపంచాయతీ పరిధిలో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఆరు సీసీ రోడ్ల పనులకు బుధవారం ఘనంగా శంకుస్థాపన జరిగింది. మురుమూరు సర్పంచ్ మడకం సుభద్ర కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.30 లక్షల నిధులు మంజూరు చేసిందన్నారు. మురుమూరు పంచాయతీ పరిధిలోని ప్రగల్లపల్లి గ్రామంలో ఈ నిధులతో ఆరు సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టడం గ్రామాభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు.

ప్రజా ప్రభుత్వం గ్రామీణ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఆయన అన్నారు. ఈ నిధులు మంజూరు చేసిన పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే తెల్లం వెంకటరావులకు గ్రామ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తల్లడి ఆదినారాయణ, కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ చెన్నం ఎల్లయ్య, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బోధబోయిన భరత్, నాగారం ఉప సర్పంచ్ మందపాటి సుబ్బరాజు, ఎస్.కే. ఖాజావలి, చిక్కుడు వెంకటేశ్వర్లు, సుధీర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



## బొగ్గు రవాణా ఓబీ తొలగింపులో రికార్డు స్థాయి పురోగతి!!

- **2.5 కోట్లతో జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం ఆధునికీకరణ పనులు**
- **కార్మిక కుటుంబాల గుండె ఆపరేషన్లకు స్థానికంగానే తక్షణ చికిత్స**
- **వంద శాతం క్లెయిముల పరిష్కారం.. కారుణ్య నియామకాల వేగవంతం**
- **సింగరేణి ఆర్జీవన్ జనరల్ మేనేజర్ లలిత్ కుమార్**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 01(డీడీ9 వార్త):**

సింగరేణి సంస్థ రామగుండం1 (ఆర్జీ1) ఏరియా పరిధిలో జూన్2026 మాసానికి సంబంధించిన ఉత్పత్తి, సాధించిన రికార్డు స్థాయి పురోగతి వివరాలను ఏరియా జనరల్ మేనేజర్ (జీఎం) లలిత్ కుమార్ బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సమగ్రంగా వెల్లడించారు. ఈ సమావేశంలో మొదటగా కంపెనీ ఉత్పత్తి వివరాలను వెల్లడిస్తూ, ఆర్జీ1 ఏరియా పరిధిలో జూన్ నెలలో మొత్తం 3,70,500 టన్నుల బొగ్గు రవాణా లక్ష్యానికి గాను 2,35,718 టన్నులు సాధించి 64 శాతం ప్రగతిని నమోదు చేసినట్లు ఆయన స్పష్టం చేశారు. ఇందులో వివిధ గనుల వారీగా చూస్తే జీడీకే 1&3 ఇన్ క్లైన్ 60%, జీడీకే 2&2ఏ ఇన్ క్లైన్ 65%, జీడీకే 11 ఇన్ క్లైన్ 56%, మరియు జీడీకే సీఎమ్ (2, 2ఏ అండ్ 5) గని 66% బొగ్గు రవాణాను విజయవంతంగా సాధించాయని తెలిపారు. ముఖ్యంగా ఓవర్ బర్డెన్ తొలగింపులో ఆర్జీ1 ఏరియా అసాధారణ ప్రతిభ కనబరిచిందని, 15,70,000 క్యూబిక్ మీటర్ల నిర్దేశిత లక్ష్యానికి గాను ఏకంగా 21,03,528 క్యూబిక్ మీటర్లను తొలగించి, 134 శాతం రికార్డు స్థాయి అద్భుత పురోగతిని నమోదు చేసిందని ప్రకటించారు. అదేవిధంగా ప్రాంతీయ అభివృద్ధిలో భాగంగా గోదావరిఖనిలోని ప్రతిష్ఠాత్మక జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం ఆధునికీకరణ కోసం సింగరేణి సంస్థ రూ. 2.5 కోట్లను ప్రత్యేకంగా కేటాయించిందని, ప్రస్తుతం ఈ పనులు టెండర్ దశలో ఉన్నాయని జీఎం వెల్లడించారు. ఇక చివరగా కార్మిక సంక్షేమ వివరాలను మరియు వైద్య సేవలను ప్రస్తావిస్తూ, కార్మికులు మరియు వారి కుటుంబ సభ్యుల అత్యవసర గుండె సంబంధిత వైద్య అవసరాల కోసం ఏరియా ఆసుపత్రిలో అత్యున్నత ప్రమాణాలతో కూడిన 'క్యాథ్ ల్యాబ్' సౌకర్యాన్ని అతి త్వరలోనే ప్రారంభించనున్నట్లు జీఎం లలిత్ కుమార్ ప్రకటించారు, దీని ద్వారా కార్మిక కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వీటితో పాటు జూన్ మాసంలో గ్రాట్యుటీ, సీఎంప్యాఫ్ రీఫండ్, పెన్షన్ మరియు ఎఫ్‌బీఐఎస్ కింద వచ్చిన అన్ని రకాల టెర్మినల్ బెనిఫిట్స్ క్లెయిములను వంద శాతం విజయవంతంగా పరిష్కరించామని, సిపిఆర్ఎంఎస్ కింద 6,348 మెడికల్ కార్డులను కార్మికులకు అందజేశామని తెలిపారు. అలాగే వారసత్వ ఉద్యోగాల ప్రక్రియను వేగవంతం చేస్తూ ప్రస్తుతం వివిధ దశల్లో ఉన్న 49 కారుణ్య నియామక దరఖాస్తులను త్వరితగతిన పరిశీలిస్తున్నామని వివరించారు.

## వైద్యులే సమాజానికి దైవ సమానులు

- **భద్రాచలం రోటరీ క్లబ్ అధ్యక్షులు షేక్ అజీమ్**
- **జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా 20 మంది వైద్యులకు ఘన సన్మానం**
- **భారత రత్న డాక్టర్ బి.సి. రాయ్ సేవలను స్మరించుకున్న రోటరీ సభ్యులు**

**భద్రాచలం, జూలై 1 (డిడి9 వార్త)**

సమాజంలో ప్రాణదాతలుగా నిలుస్తూ, నిరంతరం ప్రజారోగ్యమే ధ్యేయంగా సేవలందిస్తున్న వైద్యులను గౌరవించుకోవడం మనందరి బాధ్యతని రోటరీ క్లబ్ భద్రాచలం ప్రతినిధులు ఉద్ఘాటించారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా స్థానిక రాఘవ నిలయం (రెడ్డి సత్రం)లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన సన్మాన కార్యక్రమం అట్టహాసంగా సాగింది.

**ప్రజా సేవలో అగ్రగామి**

రోటరీ క్లబ్ నూతన అధ్యక్షుడు షేక్ అజీమ్, కార్యదర్శి పాపినేని శ్రీనాథ్ రాజేష్, కోశాధికారి కొత్త రామకృష్ణల సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ.. వైద్య వృత్తికి, ప్రజా సేవకు నిలువుటద్దంగా నిలిచిన మహనీయుడు డాక్టర్ బి.సి. రాయ్ అని కొనియాడారు. కేవలం వైద్యుడిగానే కాకుండా, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా 10 ఏళ్ల పాటు ఆయన చేసిన సేవలు అనిర్వచనీయమని పేర్కొన్నారు. వైద్య రంగంలో ఆయన చేసిన విశేష కృషికి గుర్తింపుగా భారత ప్రభుత్వం 1961లో ఆయనకు అత్యున్నత పురస్కారం 'భారతరత్న'తో గౌరవించిందని గుర్తుచేశారు.

**వైద్యుల సేవలను అభినందించిన రోటరీ**


పట్టణంలో విశేష సేవలందిస్తున్న 20 మంది ప్రముఖ వైద్యులను ఈ సందర్భంగా రోటరీ క్లబ్ సభ్యులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. సన్మానం పొందిన వారిలో డాక్టర్ సోమయ్య, డాక్టర్ కోటిరెడ్డి, అజిత్ రెడ్డి, డాక్టర్ భరణి, డాక్టర్ సంతోష్, అక్కినేని లోకేష్, సూరపనేని శ్రీకాంత్, డాక్టర్ ముదిగొండ రామకృష్ణ, డాక్టర్ పవన్ రెడ్డి, డాక్టర్ గీతామాధురి, డాక్టర్ అలీనా శాంతి, డాక్టర్ రోశయ్య, డాక్టర్ శివ రాహుల్, డాక్టర్ గోపాల్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ పూర్వ అధ్యక్షులు డాక్టర్ సోమయ్య, జకరయ్య, నాగేశ్వరరావు, మధు, రఫీ, మోత్కూరు వీరయ్య, గ్లాడ్ స్టోన్, చైతన్య రెడ్డి, శేష్ కుమార్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్‌లో చేరిన జీడికల్ సర్పంచ్, బీజేపీ మండల అధ్యక్షుడు

**జనగామ జూలై 1(డిడి 9వార్త ) బ్యూరో**

లింగాల ఘనపూర్ మండలం జీడికల్ గ్రామ సర్పంచ్ కొండబోయిన మమత, బీజేపీ మండల అధ్యక్షుడు కొండబోయిన సంపత్ బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. స్టేషన్ ఘనపూర్‌లోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ గుడి వంశీధర్ రెడ్డి ఆధ్వర్యంలో వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వీరితో పాటు గ్రామానికి చెందిన సుమారు 50 మంది కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కొల్లూరి శివకుమార్ తదితర నాయకులు పాల్గొన్నారు.




### ఒక్క రోజులో వెయ్యి సేవలు..

# లక్ష మందికి లబ్ధి

- **లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విస్తృత సేవా కార్యక్రమాలు**
- **ట్రాఫిక్ అవగాహన నుంచి ఆరోగ్య శిబిరాల వరకు పలు సేవలు**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 01(డీడీ9 వార్త):**

డిస్ట్రిక్ట్ 320G జిల్లా గవర్నర్ లయన్ మోర భద్రేశం పిలుపు మేరకు నిర్వహించిన "సింగిల్ డే-1000 సర్వీస్ ఆక్టివిటీస్-1 లక్ష మంది లబ్ధిదారులు" కార్యక్రమంలో భాగంగా లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని స్ఫూర్తి, వాసవి, లక్ష్మీనగర్, జ్యోతినగర్ ప్రగతి జోన్ల ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని రోడ్డు భద్రత, రక్తదానం, క్యాన్సర్, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించిన వాహనదారులకు గులాబీ మొక్కలు అందజేయగా, ఓ నిరుపేద విద్యార్థినికి సైకిల్ పంపిణీ చేశారు.

అనంతరం ఉచిత మధుమేహ పరీక్షలు, నేత్ర దాన అవగాహన, మొక్కల నాటకం, విద్యార్థులకు బ్యాగులు, పండ్ల పంపిణీ, అన్నదానం, ఆరోగ్య శిబిరాలు, మత్తు పదార్థాల నివారణ, ఓటు హక్కుపై అవగాహన తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




## ద్విచక్ర వాహనం పైనుండి ప్రమాదవశాత్తు క్రిందపడి వాహనదారులకు గాయాలు

**బోనకల్, జూలై01, (డీడీ9 వార్త):**

మండల పరిధిలో బోనకల్ క్రాస్ రోడ్ సమీపంలో వైరా మండలం పాలడుగు గ్రామానికి చెందిన రావూరి కృష్ణమూర్తి (65)ఇరుపార్శపు వెంకటేశ్వర్లు (76)జానకిపురం గ్రామంలో వివాహ కార్యక్రమానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో బోనకల్ క్రాస్ రోడ్ సమీపంలో ప్రమాదవశాత్తు కిందపడి గాయాలయ్యాయి, స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న 108 సిబ్బంది కోట భానుసహన్ ఎం ఎం చక్రవర్తి ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్య సేవల నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.





## మణుగూరు ట్రాక్టర్ యజమానులకు, డ్రైవర్స్ కు మధ్య కుదిరిన ఒప్పందం.

**మణుగూరు.జూలై 1(డి డి 9వార్త)**

డ్రైవర్స్ వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ 30.6.2026 నుండి సమ్మె ప్రారంభించగా బుధవారం అనగా 1.7.2026 న ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(TUCI) ఆధ్వర్యంలో ట్రాక్టర్ యజమానులకు, డ్రైవర్స్ యూనియన్ నాయకులకు మధ్య జరిగిన చర్చల్లో వేతనాలు పెంచుతూ ఒప్పందం చేసుకోవడం జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం పాత జీతం రోజుకు 500 ఉండగా 100 రూపాయలు పెంచుకొని రోజుకు 600 గా ఒప్పందం చేసుకోవడం జరిగింది. ఈ ఒప్పందం.1.7.2026 నుండి 30.6 2028 వరకు అమలులో ఉంటుంది. దీనితో పాటు విధివిధానాలు కూడా మాట్లాడుకోవడం జరిగింది. ఈ చర్చల్లో ట్రాక్టర్ యజమానుల ప్రతినిధులు ఉడతనేని. రవి, చింతల. అశోక్, వెంకటసోములు, శివ, నరసింహారావు, డ్రైవర్స్ యూనియన్ ప్రతినిధులు కోండ్రు. శీను, కోర్స. సమ్మయ్య, మడకం. లక్ష్మయ్య, గట్టుపల్లి. రమేష్, సవలం. లక్ష్మయ్య, మడకం. రాంబాబు, గట్టుపల్లి. భద్రయ్య, మహేష్, ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా( టి యు సి ఐ) జిల్లా అధ్యక్షులు ఆర్. మధుసూదన్ రెడ్డి, తెలంగాణ ప్రోగ్రెసివ్ ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాయం. వెంకన్న పాల్గొన్నారు.



## జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా సింగరేణి వైద్యురాలిని సన్మానించిన...సామాజిక కార్యకర్త అంగోత్ మంగీలాల్.

**మణుగూరు.జూలై 1 (డి డి 9వార్త)**

జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా మణుగూరు లోని సింగరేణి కాలరీస్ ప్రాంతీయ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ జ్యోతిర్మయి కి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త అంగోత్ మంగీలాల్ మాట్లాడుతూ, గత 21 సంవత్సరాలుగా సింగరేణి వైద్యశాలలో సర్జన్‌గా డాక్టర్ జ్యోతిర్మయి అందిస్తున్న సేవలు చిరస్మరణీయమన్నారు.జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా "తొలి శేష చికిత్స గ్రూప్" ఆధ్వర్యంలో డాక్టర్ జ్యోతిర్మయికి "శుశ్రుత ప్రతిమను" అందజేసి, ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు."వైద్యో నారాయణో హరిః" అనే మాటకు నిలువెత్తు నిదర్శనం డాక్టర్ జ్యోతిర్మయి అని,పర్మినెంట్ సింగరేణి కార్మికులతో పాటు కాంట్రాక్ట్ కార్మికులకు కూడా ఎటువంటి భేదభావం లేకుండా వైద్యం అందించే దేవత ఆమె. రోగిని చూసే విధానంలో, వైద్యం అందించే విధానంలో ఆమె చూపే మానవత్వం మరువలేనిది.

ఆసుపత్రిలో ఎంత మంది డాక్టర్లు ఉన్నా, పేషెంట్లు మాత్రం డాక్టర్ జ్యోతిర్మయి గారి వద్దనే క్యూ కడతారు. దానికి కారణం ఆమెపై ఉన్న నమ్మకం, ఆమె వైద్యంలో ఉన్న నిబద్ధత.వృత్తి పట్ల ఆమెకు ఉన్న అంకితభావం ఎంతో గొప్పదని,ఒక్కోసారి భోజనం సమయం దాటిపోతున్నా సరే, చివరి పేషెంట్‌కు వైద్యం అందించే వరకు ఆమె విధుల నుండి కదలరు. రోగుల బాధను తన బాధగా భావించి సేవ చేసే ఆమె సేవా నిరతి ప్రతి వైద్యుడికి ఆదర్శం.కార్మిక క్షేత్రంలో, ముఖ్యంగా బొగ్గు గని ప్రమాదాలు, శ్వాసకోశ వ్యాధులతో బాధపడే కార్మికులకు ఆమె అందించిన వైద్యం, ధైర్యం అమోఘమని ఆయన ప్రశంసించారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా డాక్టర్ జ్యోతిర్మయి లాంటి వైద్యులు సమాజానికి దొరకడం మన అదృష్టం అని, ఆమె ఆయురారోగ్యాలతో, ఇలాగే మరెన్నో సంవత్సరాలు ప్రజా సేవలో కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి ఏరియా హాస్పిటల్ డాక్టర్ సురేష్, మ్యాట్రిన్ సారా మేడం కాంట్రాక్ట్ కార్మికులు పద్మ ఉమామహేశ్వరి, ఐరన్ బి, కాంతమ్మ, కౌసల్య వెంకటరమణ ఇంద్రాణి నాగ సాయి, నాగమణి,శ్రీకాంత్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ జాబితాలో చేర్పుతోనే రజకుల అభివృద్ధి: కేతూరి శివన్న

**జనగామ జూలై 1(డిడి 9వార్త ) బ్యూరో**

రజకుల విద్య, ఉద్యోగ, రాజకీయ, సామాజిక, ఆర్థిక అభివృద్ధికి వారిని ఎస్సీ జాబితాలో చేర్చడం అవసరమని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా అధ్యక్షుడు కేతూరి శివన్న అన్నారు. మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన సమితి జిల్లా నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు తక్షణమే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ఆశించిన స్థాయిలో లేకపోవడంతో యువత వలసలు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్‌లో రజక కమ్యూనిటీ భవనం, ఆధునిక ధోబీ ఘాట్ ఏర్పాటు కోసం చర్యలు తీసుకోవాలని సమితి నాయకులు కోరారు. సమావేశంలో పలువురు జిల్లా, పట్టణ నాయకులు పాల్గొన్నారు.



# రామగుండం ఏరియా ఆస్పత్రిలో జూలై 5న సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరం

- **ఓజోన్ హాస్పిటల్ నిపుణులచే గుండె, నరాలు, కిడ్నీ, యూరాలజీ సేవలు**
- **జూలై 4 సాయంత్రం వరకు ముందస్తు నమోదు తప్పనిసరి**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 01(డీడీ9 వార్త):**

రామగుండం ఏరియా ఆస్పత్రిలో ఈ నెల 5వ తేదీ (ఆదివారం) ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు హైదరాబాద్ కొత్తపేటకు చెందిన ఓజోన్ హాస్పిటల్ సూపర్ స్పెషాలిటీ వైద్య నిపుణులచే ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి యాజమాన్యం తెలిపింది.

శిబిరంలో కార్డియాలజీ (గుండె), న్యూరాలజీ (నరాల), యూరాలజీ, నెఫ్రాలజీ (కిడ్నీ) విభాగాలకు చెందిన నిపుణులు వైద్య సేవలు అందించనున్నారు.

ఈ శిబిరానికి హాజరుకావాలనుకునే వారు జూలై 1 నుంచి జూలై 4 సాయంత్రం 4 గంటలలోపు తమ హాస్పిటల్ బుక్‌తో రామగుండం ఏరియా ఆస్పత్రిలో ముందస్తుగా నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు. ముందస్తు నమోదు చేసుకున్న వారికి మాత్రమే శిబిరంలో వైద్య సేవలు అందించబడతాయి.

రామగుండం ఏరియా 1, 2, 3, ఏఎల్‌పీ ప్రాంతాల్లో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, సిపిఆర్ఎంఎస్ఇ, సి పి ఆర్ ఎం ఎస్ ఎన్ ఈ కార్డుదారులైన రిటైర్డ్ ఉద్యోగులు, వారి జీవిత భాగస్వాములు, అలాగే అన్నిగనులు, ఓసీపీలు, వివిధ విభాగాల్లో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు మరియు వారి కుటుంబ సభ్యులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆస్పత్రి యాజమాన్యం కోరింది.




## రామగుండంలో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణం ఎప్పుడో!!

- **2018లో కేంద్రం ఆమోదం.. ఇప్పటికీ ప్రారంభం కాని 100 పడకల ఆస్పత్రి**
- **స్థలం ఎంపికలో జాప్యం, జిల్లా యంత్రాంగం నిర్లక్ష్యంపై స్వచ్ఛంద సంఘాల ఆగ్రహం**
- **60 వేల మందికిపైగా కార్మికులకు ఈఎస్ఐ వైద్య సేవలు అందించాలని డిమాండ్**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 01(డీడీ9 వార్త):**

రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ప్రతిపాదిత 100 పడకల ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ (ఈఎస్ఐ) ఆస్పత్రి నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని కోరుతూ రామగుండం స్వచ్ఛంద సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఐక్యవేదిక గౌరవ అధ్యక్షుడు మద్దెల దినేష్, ఉపాధ్యక్షురాలు గోలివాడ చంద్రకళ మాట్లాడుతూ..., 2018 సెప్టెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం ఈఎస్ఐ ఆస్పత్రికి ఆమోదం తెలిపినా, అప్పటి ప్రభుత్వం అనువైన స్థలాన్ని గుర్తించడంలో విఫలమైందని విమర్శించారు. 2022లో సమాధుల సమీపంలోని డంపింగ్ యార్డు స్థలాన్ని ప్రతిపాదించగా, రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఈఎస్ఐ అధికారులు తిరస్కరించారని తెలిపారు.

2023లో కేంద్ర ప్రభుత్వం నిబంధనలను సవరించి మూడు ఎకరాల 30 గుంటల స్థలం ఉంటే ఆస్పత్రి నిర్మించేందుకు అవకాశం కల్పించగా, రాష్ట్ర ప్రభుత్వం 2025 జనవరి 8న స్థలానికి ఆమోదం తెలిపిందని చెప్పారు. అయినప్పటికీ జిల్లా యంత్రాంగం ఇప్పటివరకు నిర్మాణ పనులు ప్రారంభించకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆరోపించారు.

రామగుండం ఈఎస్ఐ బ్రాంచ్ పరిధిలో పెద్దపల్లి, మంచిర్యాల, జగిత్యాల, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు చెందిన 60 వేల మందికిపైగా కార్మికులు ఉన్నారని, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్, సింగరేణి, సిమెంట్ పరిశ్రమలు, ప్రైవేట్ సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలలు, మున్సిపల్ కార్మికులు, బీడీ కార్మికులు తదితరులు ఈఎస్ఐ పరిధిలోకి వస్తున్నారని తెలిపారు.

ప్రస్తుతం రామగుండం ఎన్టీపీసీ, బసంత్‌నగర్, మంచిర్యాలలో మాత్రమే పరిమిత స్థాయిలో ఈఎస్ఐ డిస్పెన్సరీలు ఉన్నాయని, మిగతా జిల్లాల కార్మికులు వైద్య సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్ర అనారోగ్య పరిస్థితుల్లో వరంగల్, నాచారం, సనత్‌నగర్ ఈఎస్ఐ ఆస్పత్రులకు రిఫరల్‌పై వెళ్లాల్సి వస్తోందన్నారు.

రూ.100 కోట్ల వ్యయంతో 100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించినప్పటికీ జిల్లా యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. అసంఘటిత కార్మికులు, వారి కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు అందించాలంటే రామగుండంలో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణాన్ని తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాజకీయాలకు అతీతంగా అన్ని స్వచ్ఛంద సంఘాలను ఏకం చేసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమానికి కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు ఎం. గౌస్, వై. లెనిన్‌తో పాటు స్వచ్ఛంద సంఘాల సభ్యులు కంకటి రవి, బిళ్ల శ్రీదేవి, సరిత లక్ష్మి, కొండూ రమాదేవి, కె. సుశీల, ఇమ్మడి శారద, మేకల శోభా, మండల శ్రీనివాస్, నజీర్, వికాస్ తదితరులు మద్దతు తెలిపారు.

## నూతన తహసీల్దార్, ఎస్ఐలను మర్యాద పూర్వకంగా కలిసిన టిఎసి మెంబర్

**బోనకల్, జూలై 1,(డీడీ9 వార్త):**

మండలంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ సిహెచ్ సుధాకర్, ఎస్ఐ మాచినేని రవి లను బుధవారం టెలికాం అడ్వైజరీ కమిటీ మెంబర్ ఉమ్మినేని కృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ మండల ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాధినేని రాంబాబు తదితరులు పాల్గొన్నారు.




# బూడిద కట్ట తెగిపోతే ఎలా!!.. ఎన్టీపీసీ లో మాక్ డ్రిల్

- **విపత్తు నిర్వహణ ప్రణాళికలో భాగంగా అత్యవసర ప్రతిస్పందన విన్యాసం**
- **అధికారులు, సీఐఎస్ఎఫ్, అగ్నిమాపక, వైద్య బృందాల సమన్వయంతో విజయవంతంగా నిర్వహణ**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 01(డీడీ9 వార్త):**

విపత్తుల సమయంలో అత్యవసర ప్రతిస్పందన వ్యవస్థను మరింత పటిష్ఠం చేయాలనే లక్ష్యంతో ఎన్టీపీసీ తెలంగాణ జూన్ 30న సాయంత్రం తెలంగాణ ప్రాజెక్టు యాష్ డైక్ వద్ద 'యాష్ డైక్ బ్రీచ్ (బూడిద కట్ట తెగిపోవడం)' పరిస్థితిని ఊహిస్తూ మాక్ డ్రిల్‌ను విజయవంతంగా నిర్వహించింది. ఈ విన్యాసాన్ని సంస్థ విపత్తు నిర్వహణ ప్రణాళిక ప్రకారం చేపట్టారు.

ఈ కార్యక్రమాన్ని తెలంగాణ జీఎం (ఓ అండ్ ఎం) ముకుల్ రాయ్, రామగుండం జీఎం (ఓ అండ్ ఎం) సంజయ్ కుమార్, తెలంగాణ జీఎం (మెయింటెనెన్స్) ఎన్.కే. శర్మతో పాటు ఎన్టీపీసీ సీనియర్ అధికారులు, సీఐఎస్ఎఫ్ ఫైర్ డిప్యూటీ కమాండెంట్, రాష్ట్ర అగ్నిమాపక శాఖ ప్రతినిధులు పరిశీలించారు.

మాక్ డ్రిల్‌లో యాష్ డైక్ తెగిపోయినట్లు సంకేతాలు అందిన వెంటనే అత్యవసర ప్రతిస్పందన వ్యవస్థను అప్రమత్తం చేశారు. సేఫ్టీ, సీఐఎస్ఎఫ్ ఫైర్, సెక్యూరిటీ, మెడికల్, హెచ్ఆర్, సివిల్, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్, యాష్ యుటిలైజేషన్, యాష్ హ్యాండ్లింగ్ తదితర విభాగాల అత్యవసర బృందాలు వేగంగా స్పందించి సహాయక, నియంత్రణ చర్యలను చేపట్టాయి.

ప్రభావిత ప్రాంతాన్ని భద్రపరచడం, సహాయక చర్యలు, నియంత్రణ చర్యలు, అత్యవసర నియంత్రణ కేంద్రం నుంచి వివిధ విభాగాలతో నిరంతర సమన్వయం వంటి అంశాలను విజయవంతంగా నిర్వహించారు. ఈ మాక్ డ్రిల్ ద్వారా అత్యవసర పరిస్థితుల్లో సంస్థ స్పందన తీరు, విభాగాల మధ్య సమన్వయం, విపత్తు నిర్వహణ సామర్థ్యాన్ని సమీక్షించారు.

డ్రిల్ అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో విన్యాసంలో గమనించిన అంశాలు, భవిష్యత్తులో అత్యవసర ప్రతిస్పందన వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు చర్చించారు. ఈ మాక్ డ్రిల్ ఎన్టీపీసీ అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనే సన్నద్ధతను మరోసారి చాటిందని అధికారులు తెలిపారు.










# సింగరేణి అధికారుల పోరాటానికి బీజేపీ అండ

- **సీఎం ఓ ఏ ఐ రిలే నిరాహార దీక్షలకు కందుల సంధ్యారాణి సంఘీభావం**
- **అధికారుల న్యాయమైన డిమాండ్లను కేంద్రం దృష్టికి తీసుకెళ్తామని హామీ**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 01(డీడీ9 వార్త):**

సింగరేణి అధికారుల సంఘం సీఎం ఓ ఏ ఐ ఆధ్వర్యంలో ఆర్జీ1 జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా బీజేపీ నాయకురాలు కందుల సంధ్యారాణి దీక్షా శిబిరాన్ని సందర్శించి అధికారులకు సంఘీభావం ప్రకటించారు. దీక్షలో పాల్గొంటున్న అధికారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కందుల సంధ్యారాణి మాట్లాడుతూ..., సింగరేణి అధికారుల డిమాండ్లు పూర్తిగా న్యాయమైనవేనని పేర్కొన్నారు. కోల్ ఇండియాలో అమలవుతున్న పే అప్‌గ్రేడేషన్, పీఆర్‌పీ, ఇతర అలవెన్సులు సింగరేణి అధికారులకు కూడా వర్తింపజేయాలని కోరారు. మూడేళ్లుగా పీఆర్‌పీ బకాయిలను పెండింగ్‌లో ఉంచడం అన్యాయమని విమర్శించారు. సింగరేణి సంస్థ అభివృద్ధిలో అధికారుల పాత్ర అత్యంత కీలకమని, వారి మేధస్సు, అంకితభావం వల్లే సంస్థ పురోగమిస్తోందని అన్నారు. వేతన సవరణ, పదోన్నతులు, ఖాళీ పోస్టుల భర్తీ, సేవా నిబంధనల సవరణ, మెరుగైన వైద్య సదుపాయాలు, సంక్షేమ పథకాలు, పదవీ విరమణ అనంతర ప్రయోజనాల బలోపేతం వంటి న్యాయమైన డిమాండ్లను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ తరపున అధికారుల సమస్యలను కేంద్ర బొగ్గు శాఖ మంత్రి, సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చిన ఆమె, న్యాయం జరిగే వరకు తమ పూర్తి మద్దతు కొనసాగుతుందని స్పష్టం చేశారు. సమస్యలను శాంతియుత చర్చల ద్వారానే పరిష్కరించాలని, దీక్షలు మరింత కాలం కొనసాగాల్సిన పరిస్థితి రాకుండా యాజమాన్యం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. దీక్షలో పాల్గొంటున్న ప్రతి అధికారికి అభినందనలు తెలియజేస్తూ, వారి న్యాయమైన పోరాటం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. అనంతరం సీఎం ఓ ఏ ఐ ఆర్జీ 1 ఏరియా నాయకులు కందుల సంధ్యారాణికి కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ పార్టీ నాయకురాలి మద్దతుతో తమ ఉద్యమానికి మరింత బలం చేకూరిందని, డిమాండ్లు నెరవేరే వరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ మేనేజర్ టి. అంజయ్య, డిప్యూటీ సూపరింటెండింగ్ ఇంజనీర్ జి. కుమారస్వామి, సర్వే ఆఫీసర్ శామ్యూల్, సీనియర్ అండర్ మేనేజర్ కె. అజయ్, జూనియర్ సర్వే ఆఫీసర్ సంజీవ్ రాజు, జూనియర్ ఇంజనీర్ రాజ్‌కుమార్, వెల్ఫేర్ ఆఫీసర్ ఎస్. సాయి నహాల్‌తో పాటు బీజేపీ నాయకులు ఉరగొండ అపర్ణ, కొట్టే నరేష్, శిలారపు కళ్యాణ్, ఏరుకొండ తిరుపతి, అరవింద్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.




## ఆర్జీ2లో తోటమాలి టెండర్ వెంటనే పిలవాలి: ఐఎఫ్‌టీయూ

- **కార్మికులకు ప్రతిరోజూ పూర్తి స్థాయిలో ఉపాధి కల్పించాలని డిమాండ్**
- **ఫారెస్ట్ డీజీఎంకు వినతిపత్రం అందజేసిన ఐఎఫ్‌టీయూ నాయకులు**
- **సమస్య పరిష్కారం కాకపోతే సింగరేణి వ్యాప్తంగా ఆందోళనలకు హెచ్చరిక**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 01(డీడీ9 వార్త):**

ఆర్జీ2 డివిజన్ పరిధిలో తోటమాలి పనులకు సంబంధించిన టెండర్లను వెంటనే పిలిచి కార్మికులకు పూర్తి స్థాయిలో ఉపాధి కల్పించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్టియు డిమాండ్ చేసింది. ఈ మేరకు పలుమార్లు జనరల్ మేనేజర్, డైరెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లినప్పటికీ పరిష్కారం లభించకపోవడంతో బుధవారం ధర్నా నిర్వహించి ఫారెస్ట్ డీజీఎం కర్ణకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న మాట్లాడుత..., ఆర్జీ2 డివిజన్ పరిధిలో తోటమాలి కార్మికులు గత జనవరి నెల నుంచి సరైన పని లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. యాజమాన్యంలోని శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగా టెండర్లు పిలవడంలో జాప్యం జరుగుతోందని విమర్శించారు. టెండర్ ప్రక్రియ పూర్తయ్యే వరకు మాస్టర్ బేసిక్ విధానంలో ప్రత్యేక తాత్కాలిక టెండర్‌ను ఏర్పాటు చేసి కార్మికులకు ప్రతిరోజూ ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల కుటుంబాలు ఉపాధి లేక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించి తోటమాలి టెండర్లను ఖరారు చేయాలని, లేనిపక్షంలో సింగరేణి వ్యాప్తంగా తోటమాలి కార్మికులతో భారీ స్థాయిలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షుడు బి. అశోక్, జిల్లా అధ్యక్షుడు ఈ. నరేష్, జిల్లా నాయకులు ఐ. రాజేశం, లింగయ్య, ఐలయ్య, మల్లికార్జున్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.






## వైద్యుల సేవలకు ఎన్టీపీసీ ఘన వందనం

- **జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన ఎన్టీపీసీ**
- **"బిహైండ్ ద మాస్క్: హూ హిల్స్ ద హిలర్స్" అంశంపై అవగాహన కార్యక్రమాలు**
- **ప్రాణాలకు భరోసా ఇచ్చే దేవుళ్లకు కృతజ్ఞతాంజలి**
- **వైద్యుల సేవలను కొనియాడిన అధికారులు.. మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక సదస్సు**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 01(డీడీ9 వార్త):**

ఎన్టీపీసీ ఆధ్వర్యంలో ధన్వంతరి ఆసుపత్రిలో జాతీయ వైద్యుల దినోత్సవం-2026ను ఘనంగా నిర్వహించారు. ఈ ఏడాది "బిహైండ్ ద మాస్క్: హూ హిల్స్ ద హిలర్స్" అనే ప్రధాన అంశంతో జరిగిన కార్యక్రమంలో వైద్యుల సేవలను కొనియాడుతూ పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రాజెక్ట్ సీజీఎం ముకుల్ రాయ్ ముఖ్య అతిథిగా, రామగుండం జీఎం (ఓ అండ్ ఎం) మనీష్ అగర్వాల్ గౌరవ అతిథిగా, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి రామగుండం సీనియర్ ఆర్ఎంఓ డా. కృపా బి ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఎన్టీపీసీ ఉన్నతాధికారులు, విభాగాధిపతులు, దీప్తి మహిళా సమితి ప్రతినిధులు, గుర్తింపు పొందిన కార్మిక సంఘాలు, అసోసియేషన్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని మొక్కలు నాటే కార్యక్రమంతో ప్రారంభించారు. అనంతరం చీఫ్ మెడికల్ ఆఫీసర్ స్వాగత ప్రసంగం చేశారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ప్రముఖ వైద్యుడు డా. బిధాన్ చంద్ర రాయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వైద్యుల నిస్వార్థ సేవలు, అంకితభావం, సమాజ ఆరోగ్య పరిరక్షణలో వారి పాత్రను ప్రతిబింబించే ప్రత్యేక వీడియోను ప్రదర్శించారు. అనంతరం అతిథి మానసిక వైద్య నిపుణుడు వైద్య వృత్తిలో ఒత్తిడి నిర్వహణ, మానసిక ఆరోగ్యం, స్వీయ సంరక్షణ అవసరంపై అవగాహన కల్పిస్తూ ప్రత్యేక ప్రసంగం చేశారు. వైద్యుల కోసం వినోదాత్మక కార్యక్రమాలు నిర్వహించి వారిని సత్కరించారు. సమాజ ఆరోగ్య సంరక్షణలో వైద్యుల అంకితభావం, సేవా తత్పరత, మానవత్వానికి వారు అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తిస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# 12వ వేజ్ బోర్డు వెంటనే అమలు చేయాలి: సింగరేణి కార్మిక సంఘాల జేఏసీ

- 40 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన ఒప్పంద ప్రక్రియ ప్రారంభించాలని డిమాండ్
- నాలుగు లేబర్ కోడ్ల రద్దుకు నల్ల బ్యాడ్జీలతో నిరసన
- గనులు, విభాగాల వద్ద అధికారులకు వినతిపత్రాల సమర్పణ

**పెద్దపల్లి బ్యూరో, జూలై 01(డీడీ9 వార్త):**

బొగ్గు గని కార్మికులకు 12వ వేజ్ బోర్డు వేతన ఒప్పంద ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని, దీనికి ఆటంకంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కార్మిక సంఘాల జేఏసీ (ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, హెచ్‌ఎంఎస్) ఆధ్వర్యంలో బుధవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

ఆర్జీ1 ఏరియాలోని జీడీకే11 ఇంక్లైన్, జీడీకే2 ఇంక్లైన్ వద్ద జరిగిన కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 12వ వేతన కమిటీని 40 శాతం ఫిట్‌మెంట్ బెనిఫిట్‌తో వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేసి, వేతన ఒప్పంద చర్చలను ఇక ఆలస్యం చేయకుండా ప్రారంభించాలని కోరారు. దశాబ్దాల పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాసే ప్రతి ప్రయత్నాన్ని కార్మిక వర్గం తిప్పికొడుతుందని హెచ్చరించారు. జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు దేశవ్యాప్తంగా నిర్వహించిన ఆందోళనల్లో సింగరేణి కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారని తెలిపారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట జరిగిన



సంయుక్త ధర్నాలో జేఏసీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. కోట్లాది రూపాయల లాభాలు ఆర్జిస్తున్న బొగ్గు పరిశ్రమలో ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్న కార్మికులకు న్యాయమైన వేతన ఒప్పందాన్ని అమలు చేయకుండా జాప్యం చేయడం అన్యాయమని మండిపడ్డారు. 12వ వేజ్ బోర్డు అమలు, నాలుగు లేబర్ కోడ్ల రద్దు జరిగే వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులతో పాటు ఏఐటీయూసీ ఆర్జీ1 బ్రాంచి కార్యవర్గ సభ్యులు మాదన మహేష్, సంకె అశోక్, బోగ సతీష్‌బాబు, ఎస్. వెంకట్‌రెడ్డి, సిద్ధమల్ల రాజు, చక్రపాణి, దొంత సాయన్న, కే. శ్రీనివాసరావు, చెప్యాల భాస్కర్, పిట్ కార్యదర్శులు మానాల శ్రీనివాస్, పొన్నాల వెంకటయ్య, కారంపూరి వెంకన్న, గుర్రం ప్రభుదాస్, నాయిని శంకర్, గొడిశల నరేశ్, బలుసు రవి, బండి మల్లేష్, దాసరి శ్రీనివాస్, దాసరి అనిల్, రెడ్డి వెంకటస్వామి, ఇజ్జగిరి రాజు తదితరులు పాల్గొన్నారు.

---

## సిండికేట్ వ్యవస్థతో మద్యం దుకాణాల్లో ప్రభుత్వం నిర్ధారించిన ధర కన్నా అదనపు వసూళ్లు? కాటాపూర్ వైన్స్?

- దీనిపై సంబంధిత శాఖ ,జాప్యం దేనికి..

**తాడ్వాయి మండలం జూలై 01 (డిడి9 వార్త)**

రాష్ట్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన మద్యం పాలసీ పథకం అమలుకు విరుద్ధంగా ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో కాటాపూర్ గ్రామంలో మద్యం దుకాణాలు పెట్రేగిపోతున్నాయి పుష్కలంగా బెల్ట్ షాపులకు అనుమతించి మేమున్నామంటూ భరోసా కల్పిస్తున్నారు మద్యం ధరలు పెంచడంపై కాటాపూర్ ఏరియా ప్రజలు మండిపడుతున్నారు ఈ విషయంపై మద్యం షాపును ముట్టడించుటకు అన్ని వర్గాల ప్రజలు సిద్ధమవుతున్నారు నిబంధనలను తుంగలో తొక్కి బెల్టుషాపు నిర్వహణకు పూర్తి తోడ్పాటు అందించడమే కాకుండా మద్యం పాలసీ పథకానికి తీరని మచ్చ వేస్తున్నారు మద్యం దుకాణదారులపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని మందుబాబులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు అయితే ప్రభుత్వ నిర్ధారించిన ధర కన్నా అదనపు ధరను వసూలు చేయడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పరిస్థితి ఉంది.

గత ప్రభుత్వంలో నాణ్యతలేని మద్యం విక్రయించని ఆరోపణలు గుప్పించిన అప్పటి ప్రతిపక్షం ఇప్పుడు కొత్త మద్యం పాలసీని ప్రభుత్వం తీసుకొస్తే నిబంధనను ఉల్లంఘించి ఈమద్యం దుకాణ యాజమాన్యం పై ప్రత్యేక చర్యలు తీసుకొని వాటి సంబంధిత లైసెన్స్ రద్దు చేసే విధంగా ప్రక్రియ కొనసాగిస్తే దీనికి ఒక ఫలితం ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు స్థానిక కూడలిలో మద్యం షాపు ఏర్పాటు చేసి ప్రయాణికులు స్కూల్ విద్యార్థులు మహిళలు నిత్యం సంచరించచే ప్రదేశంలో ఈ మద్యం షాపుల ఏర్పాటు నిర్వహణ చేసి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న మద్యం పాలసీలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి స్థానికులు పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన ఫిర్యాదును పట్టించుకోకునే నాధుడే లేడని ఆరోపణలు వినిపిస్తున్నాయి స్థానిక ప్రజల సమస్యలను పరిష్కరించలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు వెంటనే ఈ మద్యం అక్రమ అదనపు వసూల ధరలు పై బెల్టు షాపుల నిర్వహణపై వీటిని ప్రోత్సహిస్తున్న వారిపై సంబంధిత ఎక్సైజ్ శాఖ మంత్రి వర్యులు అదేవిధంగా ఎక్సైజ్ శాఖ ఎస్పి స్పందించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక టీమును ఏర్పాటు చేసి వీటిపై ప్రత్యేక నిఘా పెడితే ఫలితం ఉంటుందని పలువురు విశ్లేషకులు పేర్కొంటున్నారు





## ఫతేషాపూర్‌లో ఓటర్ల జాబితాపై సమీక్ష

**జనగామ,జూలై 1(డిడి 9వార్త )బ్యూరో**

గ్రామ సర్పంచ్ అక్కనపెల్లి సుజాత ఆధ్వర్యంలో బీఎల్ఏ2 ఓటర్ల సమీక్ష సమావేశం నిర్వహించారు. బూత్ నెం. 2002 పరిధిలోని ఓటర్ల జాబితాను పరిశీలించి, కొత్త ఓటర్ల నమోదు, వివరాల సవరణ, ఓటర్ల ధృవీకరణ అంశాలపై చర్చించారు. ఓటర్ల జాబితా ఖచ్చితత్వం కోసం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో బీఎల్ఏ మహమ్మద్ షబ్బీర్ మియా, గ్రామ శాఖ అధ్యక్షుడు గాజులపాటి వీరోజి, బూత్ లెవల్ సభ్యులు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

---

## ఏ కార్యకర్త కుటుంబం ఒంటరిది కాదు..

- బి.ఆర్.ఎస్ పార్టీ ప్రతి కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటాం..

**జూలై01 డిడి9 వార్త వెంకటాపురం.**

ములుగు జిల్లా వెంకటాపురం మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు సబక రామారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కుటుంబాన్ని వెంకటాపురం మండల బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గోడవర్తి నర్సింమూర్తి బుధవారం పరామర్శించారు.

ఈ సందర్భంగా మృతుడి భార్య, ఇద్దరు చిన్నారులను ఓదార్చి, కుటుంబ ఖర్చుల నిమిత్తం రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. తండ్రిని కోల్పోయిన ఆ కుటుంబానికి పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గోడవర్తి నర్సింమూర్తి మాట్లాడుతూ, "ఆపదలో ఉన్న ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి పార్టీ అండగా ఉంటుంది. పేద కుటుంబాలను కంటికి రెప్పలా కాపాడుతూ అవసరమైన సహాయ సహకారాలు అందిస్తాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గడ్డం వివేక్, బొల్లిన నర్సింమూర్తి, అట్లూరి రఘురామ్, కానిబెల్లి శివాజీ, సమ్మయ్య, యలమటి శ్రీను, మంచర్ల నాగేశ్వరరావు, బట్ట నాగేందర్, పోడెం సురేష్, గ్రామస్తులు, యువజన సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



---

## బ్లడ్ బ్యాంక్ పై వస్తున్న అపోహలను నమ్మొద్దు ఏరియా హాస్పిటల్ సూపర్డెంట్ వై. రాజశేఖర్ రెడ్డి

- ఏరియా ఆస్పత్రిలో గడువు ముగిసిన రక్తం అందించారన్న ప్రచారం అవాస్తవం.
- ప్రైవేట్ బ్లడ్ సెంటర్ లేబులింగ్ పొరపాటే కారణం.. బాధ్యులకు మెమోలు జారీ చేసిన అధికారులు

**భద్రాచలం, జూలై 1 (డిడి9 వార్త)**



భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్‌లో ఎక్స్‌పైర్ అయిన రక్తాన్ని రోగికి అందించారంటూ సోషల్ మీడియా, కొన్ని మీడియా వేదికల్లో ప్రచారంలో ఉన్న వార్తలు పూర్తిగా అవాస్తవమని ఆస్పత్రి అధికారులు స్పష్టం చేశారు. ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా జరుగుతున్న ఈ ప్రచారాన్ని ఖండించారు. అధికారుల వివరాల ప్రకారం, వివాదానికి కారణమైన రక్త యూనిట్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్‌కు చెందినది కాదని, అది ఒక ప్రైవేట్ బ్లడ్ సెంటర్ నుంచి సేకరించిన యూనిట్ అని తెలిపారు. సంబంధిత బ్లడ్ బ్యాగ్‌పై కలెక్షన్ తేదీ 14062026 కాగా, ఎక్స్‌పైరీ తేదీ 19052026గా ముద్రించబడిందన్నారు. సాధారణంగా కలెక్షన్ తేదీ కంటే ముందుగా ఎక్స్‌పైరీ తేదీ ఉండడం అసాధ్యమని, వాస్తవానికి ఎక్స్‌పైరీ తేదీ 19072026 కావాల్సి ఉండగా, లేబులింగ్ (ప్రింటింగ్) సమయంలో పొరపాటున 19052026గా ముద్రించబడిందని వివరించారు. ఇది కేవలం లేబులింగ్ లోపమే తప్ప, రోగికి ఎక్స్‌పైర్ అయిన రక్తాన్ని అందించలేదని స్పష్టం చేశారు. అయితే ఈ లేబులింగ్ లోపాన్ని శాఖ అత్యంత సీరియస్‌గా పరిగణించినట్లు తెలిపారు. ఘటనకు బాధ్యులైన సిబ్బందికి మెమోలు జారీ చేసి వివరణ కోరినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించామని, అవసరమైతే నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు కూడా తీసుకుంటామని పేర్కొన్నారు.


---

## గోదావరి ముంపు బాధిత ఆదివాసులకు శాశ్వత పరిష్కారం చూపించాలి..

**జూలై01డిడి9 వార్త వెంకటాపురం.**

గోదావరి ముంపు ప్రభావిత ఆదివాసి కుటుంబాలకు ప్రభుత్వ స్థలాల్లో వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి శాశ్వత నివాసం కల్పించాలని తెలంగాణ భూమిపుత్ర ఆదివాసి సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పూనెం రామచంద్రరావు ప్రభుత్వాన్ని కోరారు.

బుధవారం వెంకటాపురం మండల డిప్యూటీ తహసీల్దార్ మహేంద్రకు వినతిపత్రం సమర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, వెంకటాపురం మండలంలోని ఉప్పెడు-వీరాపురం గ్రామపంచాయతీ పరిధిలోని కోయబేస్తగూడెం, తురసవానిగూడెం, టేకులబోరు గ్రామాల ఆదివాసి కుటుంబాలు ప్రతి ఏడాది గోదావరి వరదల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. వర్షాకాలంలో ఇళ్లలోకి నీరు చేరి నివాసాలు మునిగిపోతుండటంతో పాటు విషసర్పాలు, ఇతర విషప్రాణుల భయంతో చిన్నారులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారంగా సురక్షిత ప్రాంతాల్లో ప్రభుత్వ భూమిని కేటాయించి ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు, అర్హులైన ఆదివాసి కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ భూమి పుత్ర ఆదివాసి సంఘం మండల అధ్యక్షులు ఉండం రామచంద్ర ప్రసాద్, పూనెం సాయి చరణ్, తురస సూరిబాబు, తురస రాంబాబు, మిచ్చా ముత్తయ్య, జజ్జరి రవి, తురస రాజేష్, చెరుకూరి నవీన్, పూనెం రాజబాబు, కంతి సుసేంద్ర, తురస నరసింహారావు, ఆలం సాయి తదితరులు పాల్గొన్నారు.



---

## మృతుడి కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల పరామర్శ

**తాడ్వాయి మండలం జూలై 01 (డిడి9 వార్త)**

తాడ్వాయి మండలం కన్నెపల్లి గ్రామముకు చెందిన రిటైర్డ్ టీచర్ బోదెబోయిన సమ్మయ్య భార్య బోదెబోయిన వెంకటేశ్వరి ( వేణి ) కొద్దీ రోజుల క్రితం అనారోగ్యం తో మరణించారు బుధవారం దశ దిన కర్మ కార్యక్రమముకు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరు అయి కుటుంబం ని పరామర్శించిన అనంతరం వెంకటేశ్వరి చిత్రపటముకు ఘనంగా నివాళులు ఆర్పించారు ఈ కార్యక్రమములో సీతక్క యువసేన జిల్లా అధ్యక్షులు చెర్ప రవీందర్, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు దుబాసి సుధాకర్, సీనియర్ నాయకులు కడారి లక్ష్మయ్య, వార్డ్ మెంబెర్ దేవులపల్లి రాజయ్య నాలి సమ్మారావు తదితరులు పాల్గొన్నారు






## రోడ్డు, వంతెనలు నిర్మించే వరకు ఆందోళనలను చేపడతాం..

- సి.పి.ఎం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ..

**వెంకటాపురం, జూలై 1:**

మండల పరిధిలోని మారుమూల సీతారాంపురం గ్రామానికి రహదారి, వాగులపై వంతెనలు నిర్మించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం భారీ ప్రదర్శన నిర్వహించారు. ఎన్టీఆర్ సెంటర్ నుంచి బస్టాండ్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించిన పార్టీ నాయకులు, అనంతరం కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి అధికారులకు వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి బి. రెడ్డి సాంబశివ మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని ప్రభుత్వాలు చెబుతున్నప్పటికీ, సీతారాంపురం గ్రామ పరిస్థితి చూస్తే ఆ వాదనలు ఎంతవరకు నిజమో అర్థమవుతుందని విమర్శించారు. 50 సంవత్సరాలుగా 70 ఆదివాసీ కుటుంబాలు నివసిస్తున్న ఈ గ్రామానికి ఇప్పటికీ రహదారి సౌకర్యం లేకపోవడం దురదృష్టకరమన్నారు.

పూసు వాగు, ఓటిగుంట వాగులపై వంతెనలు లేక ప్రతి వర్షాకాలంలో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కేవలం ఆరు కిలోమీటర్ల రహదారి, రెండు వంతెనల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడం ప్రజల పట్ల నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు.

రోడ్డు నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులు అడ్డంకిగా చూపడం సమంజసం కాదని, ఇతర ప్రాంతాల్లో అనుమతులు ఇచ్చినట్లే సీతారాంపురానికి కూడా వెంటనే అనుమతులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రహదారి లేక, వాగులు పొంగిపొర్లే సమయంలో వైద్య సేవలు అందక ప్రాణాలు కోల్పోయిన ఘటనలను ప్రభుత్వం గుర్తు పెట్టుకోవాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధిపై చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని ఆరోపించిన ఆయన, రోడ్డు, వంతెనల నిర్మాణం పూర్తయ్యే వరకు సీపీఎం ఆధ్వర్యంలో ఉద్యమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి గ్యానం వాసు, జిల్లా కమిటీ సభ్యులు వంకా రాములు, కట్ల నరసింహాచారి, మండల కమిటీ సభ్యులు కాపుల వెంకటేశ్వర్లు, కంటి వెంకయ్య, కంతం సత్యం, గొంది రమణయ్య, గ్రామస్తులు కురుసం మల్లయ్య, మేడం నగేష్, శంకరు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

---

## కలెక్టర్ ని మర్యాదపుర్వకంగా కలిసిన బి జె పి నాయకుడు పల్ల బుచ్చయ్య

**కన్నాయిగూడెం జూలై 1(డిడి9 వార్త)**

ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం గుర్రేవుల గ్రామానికి చెందిన పల్ల బుచయ్య మాజీ ఎంపీపీ ఏటూర్ నాగారం, మాజీ రైతుబంధు జిల్లా అధ్యక్షులు ములుగు జిల్లా ఎస్పి, ఏటూరు నాగారం సి ఐ ని మర్యాద పూర్వకంగా కలిసి మండలం లోని వివిధ సమస్యల వివరించడం జరిగింది. కన్నాయిగూడెం చిన్న మండలం వెనుకబడిన మండలం అభివృద్ధి పథంలో నడపడానికి మీ కృషి కావాలి అని అన్నారు.




DD9 వార్త
తెలుగు దినపత్రిక
DD9 Vaartha
గురువారం
02-07-2026
హైదరాబాద్

# ఆ గందరగోళానికి దూరమే ఉత్తమం



"చుట్టూ ఉండే వ్యక్తులు తీసుకునే నిర్ణయాలు, వారి అభిప్రాయాలతో నిండి ఉండే సోషల్ మీడియా.. ఒక వ్యక్తి తన మనసులో ఏముందో కూడా చెప్పలేని పరిస్థితుల్ని సృష్టిస్తుందని అనిపిస్తుంది" అంటోంది సమంత. ప్రస్తుతం 'మా ఇంటి బంగారం'తో థియేటర్లలో సందడి చేస్తోన్న ఆమె ఓ ఇంటర్వ్యూలో సోషల్‌మీడియా గురించి మాట్లాడింది. "సోషల్ మీడియా కారణంగా అసలు మీరు ఎవరు? మీకేం కావాలి అనేది కూడా గుర్తుంచుకోవడం కష్టంగా మారుతుంది. సోషల్ మీడియాలో చూసి ఇతరుల ఆలోచనలు, వారి పక్షపాత ధోరణులు, అభిప్రాయాలను తీసుకుని వాటిని మనవిగా భావించడం చాలా సులభం. కానీ, ఈ గందరగోళం నుంచి దూరంగా ఉండడం చాలా ఉత్తమం. ఆ ఒత్తిడిని దూరం చేసుకోవడానికే నేను కొంత సమయం తీసుకుంటాను. రోజూ కాసేపు మౌనంగా ఉండటం, ధ్యానం చేయడం లాంటివి చేస్తాను" అని చెప్పింది.

# 80 రోజుల్లో 'వారణాసి' పూర్తి చేస్తాం..



ఫ్రాన్స్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో దర్శకుడు రాజమౌళి తన రాబోయే భారీ బడ్జెట్ చిత్రం 'వారణాసి' (Varanasi) గురించి కీలక అప్‌డేట్‌ను పంచుకున్నారు. మహేశ్ బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రానున్న ఈ సినిమా షూటింగ్ అనుకున్న సమయం కంటే ముందే పూర్తవుతుందని తెలిపారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో 'వారణాసి' అక్టోబర్‌లో పూర్తవుతుందని ఆయన తెలిపారు. తాజాగా ఈ చిత్రంపై అప్‌డేట్ అడగ్గా.. "నా నిర్మాతలు కూడా ఇక్కడే ఉన్నారు.. అందుకే నేను దీని గురించి ఎక్కువగా విషయాలు వెల్లడించలేను. అయితే, చిత్రీకరణను ఇప్పటికే దాదాపు పూర్తి చేశామని మాత్రం చెప్పగలను. ఇక మిగిలిన చిన్న సన్నివేశాలను రాబోయే 80 రోజుల్లో పూర్తి చేస్తాం" అని తెలిపారు. సెప్టెంబర్‌లోనే ముగించేస్తామని ఆయన వెల్లడించారు. దీంతో మహేశ్ అభిమానులు సంబరపడుతున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో ఈ సినిమా విడుదల కానుంది.

ఇక ఇదే ఇంటర్వ్యూలో ప్రముఖ దర్శకుడు జేమ్స్ కామెరూన్‌తో తనకు ఉన్న అనుబంధాన్ని రాజమౌళి (SS Rajamouli) పంచుకున్నారు. మొదటిసారి ఆయన్ని చూసినప్పుడు ఆశ్చర్యపోయి నిల్చున్నానని చెప్పారు. జేమ్స్ కామెరూన్ 'ఆర్‌ఆర్‌ఆర్'ను రెండుసార్లు చూశాననప్పుడు తన ఆనందానికి అవధుల్లేవన్నారు. సినిమా నిర్మాణంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వాడకం పెరుగుతున్న విషయంపై తాము చర్చించుకున్నామని తెలిపారు. ఏఐ వినియోగం కొంత ఆందోళన కలిగించినప్పటికీ.. దర్శకుల సృజనాత్మకతను ఏఐ ఎప్పటికీ భర్తీ చేయలేదని కామెరూన్ తనకు చెప్పారని వెల్లడించారు. ఆ మాటలు తనలో ఆత్మవిశ్వాసాన్ని పెంచాయని తెలిపారు.



# ఆ వేధింపులు తట్టుకోలేకపోయా.. హద్దులు మీరడంతో తల పగలగొట్టా

యంగ్ హీరోయిన్ కాయదు లోహర్ 'ముఖిల్ పేట్టై' మూవీతో సినిమా ఇండస్ట్రీకి వచ్చారు. ఇక తెలుగులో 'అల్లూరి' మూవీ చేశారు. అయితే ఈ రెండు చిత్రాలు అమ్మడుకి పెద్దగా కలిసి రాలేదు. ఆ తర్వాత చేసిన 'డ్రాగన్'తో కాయదు రేంజ్ మారిపోయింది. ఈ మూవీ బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలవడంతో ఆమెకు తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో వరుస అవకాశాలు వస్తున్నాయి. ఈ ఏడాది ఇప్పటికే ఫంకీ, పళ్లిచట్టంబి చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన ఆమె ప్రస్తుతం తెలుగులో నాని సరసన 'ది ప్యారడైజ్' మూవీలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. అలాగే సూర్యతో నటించే చాన్స్ కూడా కొట్టేశారు. ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన కూడా విడుదల కాగా.. త్వరలోనే షూటింగ్ ప్రారంభించనున్నారు. త్వరలోనే 'ఇదాయం మురళి, ఇమ్మోర్టల్ సినిమాలతో ప్రేక్షకులను అలరించనున్నారు. ఇలా వరుస క్రేజీ ప్రాజెక్టులతో దూసుకుపోతున్న కాయదు లోహర్, తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొని తన 16 ఏళ్ల వయసులో జరిగిన ఒక చేదు అనుభవాన్ని గుర్తుచేసుకుంటూ షాకింగ్ విషయాలను పంచుకున్నారు. తాను 16 ఏళ్ల వయసులో ఉన్నప్పుడు ఇంటికి దగ్గరలోనే ఉన్న ట్యూషన్‌కు వెళ్లేదానినని కాయదు లోహర్ తెలిపారు.

ఆ సమయంలో ఒక కుర్రాడు తనను ఫాలో అవుతూ అసభ్యంగా ఈవ్ టీజింగ్ చేయడం మొదలుపెట్టాడని చెప్పారు. మొదట ఆ విషయాన్ని పెద్దగా పట్టించుకోకుండా వదిలేసినప్పటికీ.. ఆ తర్వాత కూడా అతడు పదే పదే తన వెంటపడుతూ పూర్తిగా హద్దులు మీరి ప్రవర్తించాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ఆకతాయి ప్రవర్తనతో తన కోపం కట్టలు తెంచుకుందని, దాంతో ఏమాత్రం ఆలస్యం చేయకుండా పక్కనే ఉన్న ఒక పెద్ద రాయిని తీసుకుని అతడిపైకి బలంగా విసిరానని వెల్లడించారు. ఆ రాయి బలంగా తగలడంతో ఆ కుర్రాడి తల బద్దలై రక్తం కారిందని, ఆ దెబ్బతో భయపడిపోయి అతడు అక్కడి నుండి పారిపోయాడని కాయదు చెప్పారు. తాను చూడటానికి చాలా సాఫ్ట్‌గా, సైలెంట్‌గా కనిపించినప్పటికీ ఎవరైనా తప్పు చేస్తే మాత్రం తనలోని అసలైన కోపం బయటకు వస్తుందని స్పష్టం చేశారు. ఆరోజు ఆ కుర్రాడు హద్దులు దాటి ప్రవర్తించాడు కాబట్టే తాను అంతలా ఎదురు తిరగాల్సి వచ్చిందని, ఒకవేళ భవిష్యత్తులో ఎవరైనా తనతో అలా ప్రవర్తిస్తే మాత్రం అవసరమైతే మళ్లీ మళ్లీ కొడతానంటూ కాయదు లోహర్ సమాధానమిచ్చారు.

# వెన్నులో వణుకు పుట్టించే సైకలాజికల్ థ్రిల్లర్‌తో రాబోతున్న అనన్య నాగళ్ల..

టాలీవుడ్ యంగ్ హీరోయిన్ అనన్య నాగళ్ల హీరోయిన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా వైవిధ్యమైన పాత్రలతో తన పాపులారిటీని పెంచుకుంటున్నారు. ఇటీవల 'లేచిందీ మహిళా లోకం' సినిమాతో ప్రేక్షకులను అలరించిన ఈ భామ, ప్రస్తుతం ఒక సరికొత్త సైకలాజికల్ థ్రిల్లర్ మూవీ 'లీసా' తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ విలక్షణమైన చిత్రానికి జవహర్ లాల్ రాజు దర్శకత్వం వహిస్తున్నారు. ఓంశ్రీరామ్ ఆర్ట్స్, అయాన్ష్ రెడ్డి ప్రజెంట్స్, ఐరా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్స్‌పై నిర్మాతలు వెంకట్ దుగ్గిరెడ్డి, ఇలా రామకృష్ణ సంయుక్తంగా అత్యున్నత నిర్మాణ విలువలతో, ఎక్కడా రాజీ పడకుండా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ ప్రారంభం కాగా, మేకర్స్ శరవేగంగా చిత్రీకరణ జరుపుతున్నారు.

ఈ క్రమంలోనే తాజాగా చిత్రబృందం.. ఈ సినిమాలో





అనన్య నాగళ్ల పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో అనన్య ముఖమంతా తీవ్రమైన గాయాలతో, చుట్టూ రక్తం మరకలతో ఎంతో భయానకంగా కనిపిస్తున్నారు. మిమ్మల్ని థియేటర్ సీటుకే కట్టిపడేసేలా, ఉత్కంఠభరితంగా వెన్నులో వణుకు పుట్టించేలా

# ఈ సినిమాలో ఆయనతో కలిసి పనిచేయడం నా అదృష్టంగా భావిస్తున్నా

టాలీవుడ్ యంగ్ బ్యూటీ శివానీ నాగరం అతి తక్కువ సమయంలోనే ప్రేక్షకులను మనసులు గెలుచుకున్నారు. అంబాజీపేట్ మ్యారెజి బ్యాండు, హే బలవంత్ చిత్రాల్లో నటించిన ఆమె తన అందం, అభినయంతో కుర్రాళ్ల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. ఇక ఇటీవల 'లిటిల్ హార్ట్స్' సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్‌ను అందుకున్నారు. అదే జోష్‌లో ఉన్న శివానీకి కోలీవుడ్‌లో ఓ బంపర్ అందుకున్నారు. టూరిస్ట్ ఫ్యామిలీ', 'విత్ లవ్' వంటి చిత్రాలతో వరుస హిట్లు సాధించి మంచి ఫామ్‌లో ఉన్న అభిషన్ జీవింత్ హీరోగా రాబోతున్న సరికొత్త ప్రాజెక్ట్‌లో శివానీ నాగరం హీరోయిన్‌గా ఎంపికయ్యారు. ఈ సినిమాలో మరో హీరోయిన్‌గా యోగలక్ష్మి నటిస్తుండగా, కన్నడ సూపర్ స్టార్ శివరాజ్‌కుమార్ ఒక అత్యంత కీలకమైన పాత్రలో కనిపించనుండటం విశేషం. గౌతమ్ శివరామ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని డ్రామా కంపెనీ సమర్పణలో నిర్మాత ఎ. బాలమురుగన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.

ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. హీరోయిన్ శివానీ కూడా అంతే యాక్టివ్‌గా ఈ షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ప్రస్తుతం చిత్రబృందం హీరో అభిషన్, శివరాజ్‌కుమార్, శివానీ మధ్య వచ్చే కొన్ని కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. ఈ షూటింగ్‌కు సంబంధించిన ఒక ఆసక్తికరమైన వీడియోను శివానీ నాగరం తన సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. తమిళంలో తాను నటిస్తున్న తొలి సినిమా ఇదే కావడంతో చాలా సంతోషంగా ఉందని ఆమె ఈ సందర్భంగా ఎమోషనల్ అయ్యారు. తనకు కొద్దిగా తమిళ భాష కూడా వస్తుందని, ఈ సినిమా తన కెరీర్‌లో చాలా ప్రత్యేకమైనదిగా నిలిచిపోతుందని శివానీ పేర్కొన్నారు. ముఖ్యంగా లెజెండరీ నటుడు శివరాజ్‌కుమార్ సార్‌తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకునే అవకాశం రావడం తన అదృష్టమని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. అలాగే హీరో అభిషన్ చాలా ప్రతిభావంతుడని, ఆయనతో కలిసి పనిచేయడం ఎంతో ఆనందంగా ఉందని శివానీ వెల్లడించారు.



# 'కల్కి 2'లో ఆలియా భట్..

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, నాగ్ అశ్విన్ కాంబినేషన్‌లో రాబోతున్న భారీ ప్రాజెక్ట్ 'కల్కి2'. ఈ సినిమా సూపర్ హిట్ అయిన 'కల్కి'కి సీక్వెల్‌గా రాబోతుంది. అయితే ఇందులో అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ వంటి స్టార్స్ కీలక పాత్రలో కనిపించనున్నారు. షూటింగ్ ప్రారంభం కాగా.. వైజయంతీ మూవీస్ బ్యానర్‌పై మేకర్స్ పలు కీలక సన్నివేశాలను కూడా పూర్తి చేసేశారు. అయితే, గత కొంతకాలంగా ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ బ్యూటీ ఆలియా భట్ ఒక పవర్‌ఫుల్ రోల్‌లో నటిస్తోందంటూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వార్తలు వైరల్ అవుతున్నాయి. మొదటి పార్ట్‌లో హీరోయిన్‌గా నటించిన దీపికా పదుకొణెను తొలగించి ఆలియాను ఫైనల్ చేసినట్లు టాక్. ఈ నేపథ్యంలో తాజాగా ప్రభాస్ చేసిన ఒక సోషల్ మీడియా పోస్ట్ ఈ వార్తలకు మరింత బలాన్ని చేకూర్చింది.

ఆలియా భట్ ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ ఫిలిం 'ఆల్ఫా' చిత్రానికి సంబంధించిన ట్రైలర్ వీడియోను ప్రభాస్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేశారు. "'ఆల్ఫా' ట్రైలర్ అద్భుతంగా, ఎంతో ఆశాజనకంగా ఉందని ప్రశంసించారు. జూలై 3వ తేదీ కోసం ఆలియాకు, దర్శకుడికి చిత్ర బృందం మొత్తానికి తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతున్నాను" అని ప్రభాస్ రాసుకొచ్చారు. రెబల్ స్టార్ ప్రభాస్ చేసిన ఈ క్రేజీ పోస్ట్‌ను ఆలియా భట్ వెంటనే తన సోషల్ మీడియాలో రీషేర్ చేస్తూ, ఆయనకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుతం వీరిద్దరి మధ్య



జరిగిన ఈ సోషల్ మీడియా సంభాషణ నెట్టింట విపరీతంగా ట్రెండ్ అవుతోంది. అయితే, ప్రభాస్ ఇలా ఆలియా సినిమా ట్రైలర్‌ను షేర్ చేయడం వెనుక పెద్ద ప్లానే ఉందని అభిమానులు భావిస్తున్నారు. ఆలియా భట్ 'కల్కి2' సినిమాలో నటిస్తోందనే విషయాన్ని ప్రభాస్ ఈ విధంగా ఇండైరెక్ట్‌గా హింట్ ఇచ్చారంటూ నెటిజన్లు రకరకాలుగా చర్చించుకుంటున్నారు

# రావు బహదూర్‌తో నా కల నెరవేరింది



తెలుగు ప్రేక్షకులు ఇంతకు ముందెన్నడూ చూడని స్థాయిలో 'రావు బహదూర్' ఉంటుందన్నారు సత్యదేవ్. టీజర్‌కు ప్రముఖ నటుడు మహేశ్‌బాబు వాయిస్‌ఓవర్ అందించడం ద్వారా ఈ సినిమాకు మరింత బలాన్నిచ్చారని చెప్పారు. సత్యదేవ్ ప్రధాన పాత్రలో వెంకటేశ్ మహా తెరకెక్కించిన చిత్రం 'రావు బహదూర్'. మహేశ్‌బాబుతో కలిసి చింతా గోపాలకృష్ణ రెడ్డి, అనురాగ్ రెడ్డి, శరత్‌చంద్ర నిర్మించిన ఈ సినిమా ఈ నెల 3న విడుదలవుతోంది. ఈ సందర్భంగా 'రావు బహదూర్' గురించి సత్యదేవ్ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. 'సైకలాజికల్ థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కిన 'రావు బహదూర్' నా కెరీర్లో ప్రత్యేకంగా నిలిచిపోతుంది. 'రావు బహదూర్'కు ముందు, తరువాత అని ప్రేక్షకులు నన్ను గుర్తుపెట్టుకొనేలా ఈ సినిమా ఉంటుంది. ఈ మూవీని మొదలుపెట్టినప్పుడు 'మునుపెన్నడూ చూడని విధంగా తెలుగు సినిమా' అనే ట్యాగ్‌లైన్ అనుకున్నాం. మహేశ్‌బాబు గారు కూడా ఈ సినిమా చూశాక అదే మాట అన్నారు. నమ్రతా శిరోద్కర్, నాని, సుకుమార్ సహా ఇప్పటికే సినిమాను చూసిన ప్రముఖులంతా ప్రశంసిస్తున్నారు. నా పాత్ర మేకప్‌నకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. మేకప్ వేయడానికి 5 గంటలు, తీయడానికి గంటన్నర పట్టేది. ఈ సినిమా కోసం రోజుకు 16 గంటలు పనిచేశాను. నా పాత్రలోనూ, కథలోనూ ఎన్నో కోణాలుంటాయి. వెంకటేశ్ మహా దాన్ని రాసిన తీరు, తెరకెక్కించిన విధానం అద్భుతంగా ఉంటాయి. తమిళం, మలయాళ భాషల్లో వచ్చినట్లు మన దగ్గర కొత్త తరహా కథలు ఎందుకు రావు అనే ప్రశ్నకు సమాధానం చెప్పేలా ఈ మూవీ ఉంటుంది. ఈ సినిమాతో నా కల నెరవేరింది. నా కెరీర్లో తొలిసారిగా ఎక్కువ డ్యాన్స్ చేసింది ఈ సినిమా కోసమే. సాల్సా కూడా నేర్చుకోవాల్సి వచ్చింది. విభిన్నమైన ఈ కథాప్రపంచాన్ని సృష్టించడానికి సాంకేతిక నిపుణులు ఎంతో శ్రమించారు' అని చెప్పారు సత్యదేవ్.

This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500201. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.